# మహబూబ్‌నగర్ వార్త

నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల/నారాయణపేట






సైక్లింగ్ పోటీల్లో పాల్గొన్న జూనియర్ విద్యార్థులు

## మక్తల్‌లో జూనియర్ బాలుర సైక్లింగ్ పోటీలు

### 76 మంది విద్యార్థులు పోటీ

### 18 మంది రాష్ట్రస్థాయికి ఎంపిక

**మక్తల్ టౌన్, జులై 19 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ ఆదేశాల మేరకు, నారాయణపేట జిల్లా సైకిలింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జూనియర్ బాలురకు సైకిలింగ్ పోటీలు ఆదివారం ఉదయం మక్తల్ ఎల్లమ్మ కుంట, కొత్తగార్లపల్లి రోడ్డులో నిర్వహించారు. నారాయణపేట జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బి. గోపాలం, ఉపాధ్యక్షుడు జి. శివకుమార్ పోటీలను ప్రారంభించారు. 14,15,16 సంవత్సరాల వయస్సు గల బాలురు ఈ పోటీల్లో పాల్గొన్నారు. మొత్తం 76 మంది బాలురు తమ క్రీడా నైపుణ్యతను, ప్రతిభను చాటారు. ఈ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఎంపిక చేసినట్లు బి. గోపాలం తెలిపారు. ఎంపికైన వారు ఈ నెల 20వ తేదీన హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీలోని వెలడ్రోమ్ సైకిలింగ్ అకాడమీలో ప్రవేశం కొరకు జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని వెల్లడించారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులు బి.అర్జున్ కుమార్, అక్షయ్ కుమార్, బి.వెంకటేష్, జి.రమేష్, బి. గోపిచంద్, లోకేష్, శ్రీనాథ్, జనార్ధన్, వేణుగోపాల్, విగ్నేష్, అవినాష్, అభిలాష్, ఆకాష్, మనోహర్, పురుషోత్తం, వెంకటేష్, మహేష్, అశోక్ ఉన్నారు. ఈ కార్యక్రమంలో పిడి, పీఈటీలు రేణుక, మీనా కుమారి, అమ్రేష్, దామోదర్, స్వప్న, చంద్రకళ, బోయ లలిత, అవంతి, యాదగిరి, బుడ్డప్ప తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయంలో పడి పోయిన సిమెంట్ పెచ్చులను పరిశీలిస్తున్న తహసీల్దార్ అద్దంకి సునీత

## భయం గుప్పిట్లో విధులు..

### కార్యాలయంలో పై కప్పు పెచ్చులూడి పడుతున్న దృశ్యం

**ఉప్పునుంతల, జులై 19 ప్రభాతవార్త :** ప్రభుత్వ కార్యాలయాల్లో నిర్వహించడానికి హాజరవుతున్న అధికారులు కార్యాలయాల్లో కూర్చొని విధులు నిర్వహించడానికి జంకుతున్నారు. మండల కేంద్రమైన ఉప్పునుంతల తహసీల్దార్, ఎంపిడిఓ కార్యాలయంలో పై కప్పు నుంచి సిమెంట్ పెచ్చులు ఊడి పడుతుండటంతో కార్యాలయంలో ఎప్పుడూ ఏమి జరుగుతుందో అని భయాందోళన మధ్య విధులు నిర్వహిస్తున్నారు. ఇటీవల ఎంపిడిఓ ఛాంబర్లో సిమెంట్ పెచ్చులు పడుతుండటంతో భయాందోళనతో వేరే రూంలోకి మార్చారు.అదే గదిలో ఉపాధి సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. వారు కంప్యూటర్, రికార్డులు, కూలీల వివరాలతో విధుల్లో నిమగ్నమై ఉంటున్నారు. ఎప్పుడు కూలిపోతుందోనని నిత్యం భయం గుప్పిట్లో విధులు నిర్వహిస్తున్నారు.రెండు రోజుల క్రితం తహసీల్దార్ కార్యాలయంలో కంప్యూటర్ గదిలో ఒక్కసారిగా సిమెంట్ పెచ్చులు ఊడికింద పడిపోవడంతో సిబ్బంది అప్రమత్తంగా కంప్యూటర్లు వదిలి వేసి బయట పరుగులు తీయడంతో పెద్ద ప్రమాదం తప్పింది. నిత్యం విధులు నిర్వహిస్తున్న సిబ్బంది వివిధ సమస్యలపై కార్యాలయానికి వచ్చే ప్రజలతో మమేకమై వారిసమస్యల పరిష్కారంకోసం సూచనలు,సలహాలు అందిస్తున్న సమయంలో భవనం పైనుంచి సిమెంట్ పెచ్చులు పడుతుండటంతో – మిగతా3లో..



బోటు సహాయంతో ముమ్మరంగా గాలింపు (ఇన్‌సెట్లో ) గల్లంతైన అవుల తిరుపతయ్య ( ఫైల్)

## చేపల వేటకు వెళ్లి వ్యక్తి గల్లంతు

### ఎస్ఐ పుట్ట మహేష్, ఫైర్ స్టేషన్ వారి ఆధ్వర్యంలో ముమ్మరంగా గాలింపు చర్యలు

**ఉప్పునుంతల, జులై 19 ప్రభాతవార్త :** మండలంలోని మామిళ్ళపల్లి గ్రామంలో ఊరచెరువులో చేపల వేటకు వెళ్లిన ఆవుల తిరుపతయ్య (50) గల్లంతయ్యాడు.కుటుంబ సభ్యుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. శనివారం మధ్యాహ్నం ఉన్న చేపల వేటకు వెళ్లాడని, అనంతరం చెరువులో పడి గల్లంతయ్యాడు. ఎంతకు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు అందుకున్న ఎస్సై పుట్ట మహేష్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం పోలీసు బలగాలు సంఘటన స్థలానికి చేరుకున్నారు. మొదటగా పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.ఎంతకీ ఆచూకీ లభ్యం కాకపోవడంతో అచ్చంపేట ఫైర్ స్టేషన్ కు సమాచారం అందించారు.పోలిసులు, ఫైర్ స్టేషన్ సిబ్బంది సంయుక్తంగా గల్లంతైన ఆదివారం రోజంతా సహాయక చర్యలు చేపట్టారు. అచ్చంపేట ఫైర్ స్టేషన్ ఎస్ఐ శంకర్ గౌడ్ ఆధ్వర్యంలో ఫైర్ సిబ్బంది బోటు సహాయంతో ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు.ఆదివారం సాయంత్రం – మిగతా3లో..

## సర్ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలి

**అచ్చంపేట, జులై 19 ప్రభాతవార్త:** సర్ ప్రక్రియ త్వరిగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే డా. వంశీకృష్ణ బిఎల్ఓ లకు సూచించారు. ఆదివారం బల్మూరు మండలం గోదల్ గ్రామంలో సర్ ఎన్యుమరేషన్ ప్రక్రియను పరిశీలించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కోల్పోకుండా జాగ్రత్త పడాలని ఒకటికి రెండుసార్లు ఓటర్ల వివరాలు సరి చూసుకోవాలని అన్నారు.ఇప్పటికీ అధికారుల నివేదిక ప్రకారం ఒక్కో గ్రామంలో 75 80 పూర్తయిందని తెలిపారు. ఓటరు నమోదు ప్రక్రియ ఆగస్టు 3 వరకు పొడిగించడం జరిగిందని ఈ గడువులోగా పూర్తిస్థాయిలో 100% పూర్తి చేయాలని బిఎల్ఓలకు సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

# ప్రాజెక్టుల సాధనకు కృషి చేస్తాం

- ఎంపి మల్లు రవి
- సాగునీటి సమస్య పరిష్కారానికి సమిష్టి కృషి అవసరం
- గత పదేళ్లలో బిఆర్ఎస్ మోసం
- అంతరాష్ట్ర సమన్వయం కీలకం
- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి
- ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా బీడు భూముల సాగునీటి సమస్యలు, పెండింగ్ ప్రాజెక్టులపై విస్తృత రౌండ్ టేబుల్ సమావేశం
- పాల్గొన్న మాజీ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్



మాట్లాడుతున్న ఎంపి మల్లురవి


**మహబూబ్ నగర్ బ్యూరో, జులై 19 ప్రభాత వార్త :** ఉమ్మడి మహబూబ్ నగర్ ప్రాజెక్టుల సాధనకు తనవంతు కృషి చేస్తానని నాగర్ కర్నూల్ ఎంపి మల్లు రవి పేర్కొన్నారు. మహబూబ్ నగర్ నగరంలోని క్రౌన్ ఫంక్షన్ హాల్‌లో ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా బీడు భూముల సాగునీటి సమస్యలు, పెండింగ్ ప్రాజెక్టులపై విస్తృత రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపితో కలిసి ప్రభుత్వవిప్,ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎంపి మాట్లాడుతూ ఉమ్మడి మహబూబ్ నగర్ రైతుల యొక్క ప్రయోజనాలే తమకు ముఖ్యం అని ఆయన చెప్పారు. ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ గత పది సంవత్సరాల బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రాజెక్టుల పేరుతో రైతులను మోసం చేసిందని, ప్రాజెక్టులు పూర్తి చేయకుండానే పూర్తి చేసినట్లుగా హంగామా చేసిందన్నారు. ఈ పరిస్థితి చూస్తే మళ్ళీ నాటి తెలంగాణ రాష్ట్ర సాధన కోసం చేసిన ఉద్యమమే గుర్తుకు వస్తుందన్నారు. పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేస్తే బీడు భూములను సస్యశ్యామలం చేయవచ్చని తెలిపారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజా సంఘాలు కలిసి సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. పాలమూరు జిల్లా వలసల జిల్లాగా, వెనుకబడిన ప్రాంతంగా ఉండేదని, కానీ ప్రస్తుతం అన్ని విధాలా అభివృద్ధి దిశగా తీసుకెళ్లేందుకు ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డప్పుడు మిగులు బడ్జెట్, ఆర్థిక వ్యవస్థ కూడా బలంగా ఉండడమే కాదు అప్పట్లో కొత్త రాష్ట్రం కాబట్టి బ్యాంకులు కూడా విరివిరిగా సహాయం చేశాయని, కాని ఇప్పుడు పరిస్థితి అలా లేదని డబ్బు రీపేమెంట్ చేస్తే కానీ నిధులు బ్యాంకులు ఇవ్వలేవని,అయినా పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు కోసం బడ్జెట్‌లో 5,6 వేల కోట్లు కేటాయించవచ్చు కాని వాటితో ప్రాజెక్టు పూర్తి కాదని కనీసం 30 వేల కోట్లు కావాలని ఆయన చెప్పారు. నిజాలను నిర్భయంగా చెప్పాలని ,నిజాయితీగా మాట్లాడాలని, అలా మాట్లాడితే సమస్య పరిష్కారం లభిస్తుందని ఆయన చెప్పారు. ఇలాంటి రౌండ్ టేబుల్ సమావేశాల్లో రైతులను కూడా భాగం చేయాలని, సమస్యలపై స్పష్టమైన అవగాహన కల్పించి, సరైన పరిష్కార మార్గాలను చూపుతాయని చెప్పారు. తెలంగాణ ఉద్యమ సమయంలో మహబూబ్ నగర్ వెనుకబాటు పరిస్థితులు, సాగునీటి ప్రాజెక్టుల లోపాలే ప్రధాన కారణమని, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఆవశ్యకత కూడా మన మహబూబ్ నగర్ నీటి బాధల ద్వారానే వచ్చిందన్న విషయాన్ని గుర్తుచేసిన ఆయన, ప్రస్తుతం రాష్ట్ర ముఖ్యమంత్రి కూడా మహబూబ్ నగర్ మట్టి బిడ్డ రేవంత్ రెడ్డి ఉండడంతో పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని త్వరగా పూర్తి చేసి రైతులకు సాగునీరు అందిస్తామని ఆయన చెప్పారు. గత ప్రభుత్వం పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు 90 శాతం పూర్తయిందని చెప్పడం వాస్తవానికి విరుద్ధమని విమర్శించారు. ఉదండాపూర్ వద్ద పనుల పరిస్థితి ఆశించిన విధంగా లేదని అక్కడ బొందల గడ్డను తలపిస్తుందని తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో ఇలాంటి రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించి ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేయాలని జేఏసీ నాయకులకు సూచించారు. ఇప్పటికైనా ప్రజాస్వామ్య పద్ధతుల్లో అన్ని వేదికలపై పెండింగ్ ప్రాజెక్టులపై చర్చలు జరిపి ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. రాజకీయ ఆరోపణలకంటే రైతుల భవిష్యత్తు – మిగతా3లో..



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం

### కలిసి కట్టుగా పోరాటం చేద్దాం....

**మాజీ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్**



పాలమూరు సాగు నీటి జలాల కోసం ఉమ్మడిగా కలిసికట్టుగా సమిష్టిగా పోరాటం చేద్దాం అని మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రాజెక్ట్ లను పూర్తి చేసుకోవడం తో పాటు చెరువులు నింపడం తో సాగు విస్తీర్ణం పెరిగిందన్నారు. గతంలో రెండు లక్షల ఎకరాల సాగు ఉండగా గత బీఆర్ఎస్ ప్రభుత్వ చర్యలతో పది లక్షల ఎకరాలు సాగులోకి తెచ్చామని, గతంలో ఉన్న మోటార్లను తొలగించి కృష్ణ నీటిని ఇంటింటికి ఇచ్చామన్నారు. జూరాల సామర్థ్యం 11 టీఎంసీ ఉండగా ఇప్పుడు 6.7 టీఎంసీల నీరు కూడా లేదని పేర్కొన్నారు. పాలమూరు ప్రాజెక్ట్ పూర్తి చేస్తే రైతులకు ప్రయోజనం కలుగుతుందని, వరద వచ్చిన 40 రోజుల్లో 60 టీఎంసీ ల రిజర్వాయర్లు నింపుకోవాలి. ఆ సామర్థ్యం కలిగిన మోటార్లను అందుబాటులోకి తెచ్చినట్లు వివరించారు. పది శాతం పనులు పూర్తి చేస్తే 12 లక్షల 32 వేల ఎకరాలకు నీరు వస్తుందన్నారు. టెండర్లు పిలిస్తే వాటిని రద్దు చేసారని, ఈ బడ్జెట్ లో నిధులు తెచ్చుకొని పూర్తి చేసుకోవాలని సూచించారు. జిల్లాకు సాగునీరు దక్కకుండా చేసేందుకు కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ ప్రయత్నం చేస్తుంది. ఆర్డీఎస్ నుంచి అక్రమంగా నీరు తరలించేందుకు అనుమతి లేకుండా ప్రాజెక్టులు కడుతున్నారని దీనిని అడ్డుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఆల్మట్టి వద్ద 300 టీఎంసీల నీరు నిలుపుకునేందుకు ఎత్తును పెంచుతున్నారని, దీనిని న్యాయపరంగా ముందుకు వెళ్ళాలని కోరారు. తెలంగాణకు నీళ్లు ఇవ్వవద్దని పని చేసిన ఆంధ్ర అధికారిని సలహాదారుగా నియామకం చేసారు.ఆయన ఆంధ్రకు మేలు చేసే అవకాశం ఉందని అప్రమత్తంగా ఉండాలన్నారు.

# వృద్ధులను మోసం చేస్తున్న ముఠా అరెస్ట్

### రూ.35,800 నగదు, బైక్ సహా పలు వస్తువులు స్వాధీనం

**నారాయణపేట, జులై 19 ప్రభాతవార్త :** బ్యాంకుల వద్దకు వచ్చే వృద్ధులను లక్ష్యంగా చేసుకుని మోసాలకు పాల్పడుతున్న ఇద్దరు నిందితులను నారాయణపేట పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.35,800 నగదు, షైన్125 మోటార్ సైకిల్‌తో పాటు ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు.. పేట రూరల్, టౌన్, ధన్వాడ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల వృద్ధులను మోసం చేస్తున్న ఘటనలు జరుగుతున్నట్లు సమాచారం అందడంతో రూరల్ ఎస్ఐ ఎస్. సతీష్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. ఆదివారం ఉదయం చిన్న జట్రం చౌరస్తా వద్ద నిర్వహించిన వాహన తనిఖీల్లో షైన్ 125 బైక్‌పై అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో నిందితులు మహబూబ్‌నగర్ జిల్లా మూసాపేట మండలం వేముల గ్రామానికి చెందిన చీరాల ఈశ్వరయ్య అలియాస్ శివ అలియాస్ మీసమోడా (43), చీరాల రాధ అలియాస్ లక్ష్మి (43)గా గుర్తించారు పోలీసుల కథనం ప్రకారం, నిందితులు బ్యాంకులకు వచ్చే వృద్ధులతో "మీ కొడుకు లేదా కూతురు మాకు తెలుసు" అంటూ పరిచయం ఉన్నట్లు నమ్మించి, వారి వద్ద ఉన్న నగదును తీసుకుని, "అటు చిన్న పని ఉంది, ఇప్పుడే వస్తాం" అంటూ అక్కడి నుంచి పరారయ్యేవారు నిందితుడు ఈశ్వరయ్యపై ఇప్పటికే నారాయణపేట, ధన్వాడ, వనపర్తి, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో మొత్తం 15 కేసులు నమోదయ్యాయి. అతను వనపర్తి జిల్లాలో రెండుసార్లు పీడీ యాక్ట్ కింద జైలుకు వెళ్లినట్లు పోలీసులు తెలిపారు. నిందితుల వద్ద నుంచి రూ.35,800 నగదు, షైన్125 మోటార్ సైకిల్, శాంసంగ్ మొబైల్ ఫోన్, రిఫ్రిజిరేటర్, స్మార్ట్ టీవీ, మాస్క్, బ్లేడ్‌ను స్వాధీనం చేసుకుని, అనంతరం రిమాండ్‌కు తరలించారు. ఈ సందర్భంగా సీఐ శివశంకర్ మాట్లాడుతూ, బ్యాంకుల వద్ద అపరిచితులను ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మవద్దని, నగదును ఎవరికీ అప్పగించవద్దని సూచించారు. ముఖ్యంగా వృద్ధులు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు లేదా 100 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. కేసును ఛేదించిన రూరల్ ఎస్ఐ ఎస్. సతీష్ కుమార్ రెడ్డి, కానిస్టేబుళ్లు లింగమూర్తి, సురేష్, ఐటీ సెల్ సిబ్బందిని రివార్డుకు సిఫారసు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



మోసాలకు పాల్పడుతున్న నిందితులను అరెస్టు చేసిన పోలీసులు

## చిన్నారి నవ్వులు.. మళ్ళీ చూద్దాం

- బ్రెయిన్ ఇన్ఫెక్షన్‌తో కిమ్స్‌లో చికిత్స
- 45రోజులుగా ఐసీయూలోనే..
- బిడ్డ ఆరోగ్యం కోసం తల్లఢిల్లుతున్న తల్లిదండ్రులు
- ఇప్పటికే రూ.35లక్షల ఖర్చు..
- ఆస్తులు లేవు.. అమ్మడానికి పొలావు లేవు..
- దేవుడి పైనే భారం



4

# జర్నలిస్టులు నిష్పక్షపాతంగా వార్త కథనాలు రాయాలి..!!

- ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకునేదే నిజమైన జర్నలిజం
- వనపర్తి జిల్లాలో ఉన్న జర్నలిస్టులు నా ఆత్మీయులు
- రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేన రెడ్డి

**వనపర్తి, జులై 19, ప్రభాతవార్త :** ప్రజాస్వామ్యంలో జర్నలిస్టులు ప్రజాహితం కోసం నిష్పక్షపాతంగా వార్త కథనాలు రాసి ప్రజలకు ప్రేరణగా,ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకునేదే నిజమైన జర్నలిజం అని డీసీసీ చీఫ్,రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేన రెడ్డి అన్నారు. ఆదివారం నాంపల్లిలోని తెలంగాణ మీడియా అకాడమీ ఆడిటోరియంలో అకాడమీ ఆధ్వర్యంలో జర్నలిస్టుల వృత్తి నైపుణ్యాలను మరింత మెరుగుపర్చేందుకు నిర్వహిస్తున్న రెండు రోజుల జర్నలిస్టుల శిక్షణా శిబిరం ప్రారంభ మహోత్సవానికి మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ కె. శివసేన రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు మారుతున్న కాలానికి అనుగుణంగా తమ వృత్తి నైపుణ్యాలను నిరంతరం పెంపొందించుకోవాలని, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే నిష్పక్షపాత, బాధ్యతాయుతమైన జర్నలిజాన్ని ఆచరించాలని పిలుపునిచ్చారు.శివసేన రెడ్డి మాట్లాడుతూ మీడియా ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభమని పేర్కొన్నారు. మారుతున్న సాంకేతిక పరిణామాలు, డిజిటల్ మీడియా విస్తరణ, సామాజిక మాధ్యమాల ప్రభావం నేపథ్యంలో జర్నలిస్టులు నిరంతరం తమ వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. రాజకీయ లేదా అధికార ఒత్తిళ్లకు లొంగకుండా ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని వాస్తవాలను నిర్భయంగా వెలుగులోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఫేక్ న్యూస్ వ్యాప్తి పెరుగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో వాస్తవ నిర్ధారణ (ఫ్యాక్ట్ చెకింగ్), నైతిక విలువలు, విశ్వసనీయతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. చిన్న పత్రికలు, డిజిటల్ మీడియా, యూట్యూబ్ వేదికల్లో పనిచేసే జర్నలిస్టుల్లోనూ విశేష ప్రతిభ ఉందని, నిజాయితీతో పనిచేసే వారికి గుర్తింపు తప్పకుండా లభిస్తుందని పేర్కొన్నారు.అనంతరం వనపర్తి జర్నలిస్టులు నా ఆత్మబంధువులను, ఆత్మీయులు అని అభివర్ణించారు. అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ...జర్నలిజం వృత్తికి నిరంతర అధ్యయనం అవసరమైన అని పేర్కొన్నారు. ఎంతటి అనుభవం ఉన్నప్పటికీ మారుతున్న కాలానికి అనుగుణంగా కొత్త పరిజ్ఞానం, సాంకేతికత, చట్టాలు, సామాజిక అంశాలపై అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామీణ జర్నలిస్టుల వృత్తి నైపుణ్యాలను మెరుగుపరిచేందుకు రాష్ట్రవ్యాప్తంగా మీడియా అకాడమీ శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తోందని తెలిపారు. ఈ శిక్షణా కార్యక్రమాలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకొని ప్రజలకు ఉపయోగపడే బాధ్యతాయుతమైన జర్నలిజాన్ని అందించాలని ఆయన పిలుపునిచ్చారు. శిక్షణా శిబిరంలో సీనియర్ జర్నలిస్టులు దిలీప్ రెడ్డి, మార్కండేయ, సుధాకర్ రెడ్డి, గోవింద్ రెడ్డి డిజిటల్ జర్నలిజం, సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ), మీడియా నైతిక విలువలు, సమకాలీన జర్నలిజం అంశాలపై పాల్గొనేవారికి అవగాహన కల్పించారు. ఇతర నిపుణులు జర్నలిజంలో వృత్తి నైతిక విలువలు, వార్తా రచనలో ప్రమాణాలు, డిజిటల్ యుగంలో జర్నలిస్టులు అనుసరించాల్సిన బాధ్యతలు, మానవ అక్రమ రవాణా, బాల కార్మిక వ్యవస్థ, వెట్టి చాకిరి నిర్మూలన, బాధితుల పునరావాసంలో మీడియా పోషించాల్సిన పాత్రపై సమగ్రంగా వివరించారు.అదేవిధంగా శిబిరంలో సామాజిక సందేశంతో రూపొందిన "నెరవేరిన కల" ఫీచర్ చిత్రాన్ని ప్రదర్శించారురాష్ట్రంలోని వివిధ జిల్లాల జర్నలిస్టులు అకాడమీ నిర్వహించే రెండు రోజుల శిక్షణా శిబిరాలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకొని తమ వృత్తి నైపుణ్యాలను మరింత మెరుగుపరుచుకోవాలని, ప్రజలకు విశ్వసనీయమైన, బాధ్యతాయుతమైన, నిష్పక్షపాత జర్నలిజాన్ని అందించాలని వక్తలు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ మీడియా అకాడమీ కార్యదర్శి ఎన్. వెంకటేశ్వరరావు, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మధు, సీనియర్ జర్నలిస్టులు, నిపుణులు, వివిధ జిల్లాల నుంచి హాజరైన జర్నలిస్టులు, అధికారులు పాల్గొన్నారు.



శివసేన రెడ్డిని సన్మానిస్తున్న మీడియా అకాడమీక్ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి



శిక్షణ తరగతులకు హాజరైన వనపర్తి జిల్లా జర్నలిస్టులు

## లైసెన్స్ పొందిన డీలర్ల వద్దనే ఎరువులు కొనాలి



ఎరువుల విక్రయ కేంద్రాలను తనిఖీ చేస్తున్న మండల వ్యవసాయ అధికారి రాజ వర్ధన్

**కెటిదొడ్డి జూలై 19 ప్రభాతవార్త:** మండలం పరిధిలోని వెంకటాపురం , తదితర గ్రామాలలో ఎరువుల విక్రయ కేంద్రాలను మండల వ్యవసాయ అధికారి వై. రాజవర్ధన్ రెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .డీలర్లకు విత్తనాలు, పురుగుమందులు, ఎరువుల విక్రయానికి సంబంధించిన ప్రభుత్వ నియమ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. రైతులకు సరైన బిల్లులు జారీ చేయాలని, నిబంధనలకు విరుద్ధంగా ఎటువంటి విక్రయాలు చేపట్టరాదని డీలర్లకు ఆదేశించారు. రైతులు విత్తనాలు, పురుగుమందులు మరియు ఎరువులను లైసెన్స్ పొందిన అధీకృత డీలర్ల వద్ద మాత్రమే కొనుగోలు చేయాలని సూచించారు. ప్రతి కొనుగోలుకు తప్పనిసరిగా కొనుగోలు బిల్లు పొందాలని రైతులకు అవగాహన కల్పించారు. బిల్లు తీసుకోవడం ద్వారా రైతులకు కొనుగోలు చేసిన ఉత్పత్తికి సంబంధించిన ఆధారం ఉంటుందని తెలిపారు. రైతులు నాణ్యమైన విత్తనాలు, పురుగుమందులు, ఎరువులను మాత్రమే వినియోగించి, వ్యవసాయ శాఖ సూచనలు పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వై. రాజవర్ధన్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

## మహిళల హక్కులకై పోరాడుదాం

**టిపిటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు నారాయణమ్మ**




సమావేశంలో మాట్లాడుతున్న నారాయణమ్మ

**చిన్న చింతకుంట ,జులై 19 ప్రభాతవార్త :** మహిళల హక్కుల కోసం పోరాడేందుకు సిద్ధం కావాలని టిపి టిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు నారాయణమ్మ పిలుపునిచ్చారు. ఆదివారం లాల్ కోట గ్రామంలో ప్రగతిశీల మహిళా సంఘం ఆధ్వర్యంలో సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా మాట్లాడారు. సమాజంలో మహిళలపై జరుగుతున్న అత్యాచారాలను అరికట్టాలని ఆమె డిమాండ్ చేశారు. బేటి పడావో బేటి బచావో పథకాన్ని కేంద్ర ప్రభుత్వం సక్రమంగా అమలు చేయాలని, పార్లమెంట్‌లో మహిళా బిల్లును 50శాతంగా ఆమోదించాలని ఆమె డిమాండ్ చేశారు. ప్రస్తుతం వర్షాలు రాక పోవడంతో కరువు కాటకాలు వస్తుండడం తో కేంద్ర ప్రభుత్వం రేషన్ బియ్యం తో పాటు తొమ్మిది రకాల సరుకులను ఉచితంగా ఇవ్వాలని ఆమె డిమాండ్ చేశారు. అనంతరం ప్రగతిశీల మహిళా సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలుగా నాగమ్మ, ఉపాధ్యక్షులుగా మణెమ్మ, సునీత, కార్యదర్శులుగా కోళ్ల లక్షి ్మ, కోశాధికారిగా మంజుల లతో పాటు తొమ్మిది మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నట్లు ఆమె తెలిపారు. ఈ సమావేశంలో సిపిఐ మాస్ లైన్ జిల్లా నాయకులు సాంబశివుడు, మండల నాయకులు కోళ్ల అంజన్న, మేస్త్రి నరసింహులు, పల్లమర్రి రాజు, మొండిరాజు తదితరులు పాల్గొన్నారు.

## 108 అంబులెన్స్‌లో ప్రసవం.. తల్లీబిడ్డ క్షేమం



అంబులెన్స్‌లో ప్రసవం తల్లీ బిడ్డ క్షేమం

**దామరగిద్ద, జులై 19 ప్రభాతవార్త :** దామరగిద్ద మండలంలో 108 అంబులెన్స్ లో గర్భిణికి సురక్షితంగా ప్రసవం నిర్వహించి తల్లి, మగ శిశువును క్షేమంగా కాపాడారు. మొగలమడక గ్రామానికి చెందిన స్రవంతికి తొలి కాన్పు నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108కు సమాచారం అందించారు. అంబులెన్స్ లో నారాయణపేట జిల్లా ఆసుపత్రికి తరలిస్తుండగా మూస్తేపేట సమీపంలో ప్రసవ వేదనలు తీవ్రం కావడంతో ఈఆర్‌సీపీ వైద్యుడు డా. శివ సూచనల మేరకు ఈఎంటీ మహేష్ అంబులెన్స్ లోనే సాధారణ ప్రసవం నిర్వహించారు. అనంతరం నవజాత శిశువుకు ప్రాథమిక చికిత్స, ఆక్సిజన్ అందిస్తూ తల్లి, బిడ్డలను జిల్లా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు ఇద్దరూ క్షేమంగా ఉన్నట్లు తెలిపారు. సమయస్ఫూర్తితో వ్యవహరించిన అంబులెన్స్ పైలెట్ రాములు, ఈఎంటీ మహేష్‌లను బాధిత కుటుంబ సభ్యులు, వైద్యులు అభినందించారు. ఉమ్మడి జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ రవికుమార్, జిల్లా మేనేజర్ సునీల్ కుమార్ అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు 108 అంబులెన్స్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు.

## ఘనంగా టీఆర్ఎస్ పార్టీ జెండా ఆవిష్కరణ





టిఆర్ఎస్ జెండా ఆవిష్కరణ చేస్తున్న దృశ్యం

**దామరగిద్ద, జులై 19 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా దామరగిద్ద మండలం ఆశన్‌పల్లి గ్రామంలో ఆదివారం టీఆర్ఎస్ పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గ్రామ పార్టీ అధ్యక్షుడు కోయిడె నర్సింహా పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి జిల్లా పార్టీ అధ్యక్షుడు, నారాయణపేట నియోజకవర్గం ఇన్‌చార్జి గవినోళ్ల శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గవినోళ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పార్టీ ప్రజా సమస్యల పరిష్కారానికి కట్టుబడి పనిచేస్తోందన్నారు. గ్రామీణాభివృద్ధి, రైతుల సంక్షేమం, యువతకు ఉపాధి అవకాశాలు, మహిళల సాధికారత కోసం మండల పార్టీ అధ్యక్షుడు నర్సింహా రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్ గౌడ్, జిల్లా నాయకులు పల్లెబండ నర్సిములు, శివశంకర్, నరేష్, నారాయణరెడ్డి, ఆటో రమేష్, వెంకట్రాంలు గౌడ్, లాలప్ప, అశోక్, పకీరప్ప, ఖాజీపురం వెంకటప్ప, బీషప్పతో పాటు వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మంత్రి చొరవతో కటిక సంఘానికి వదశాల స్థలం కేటాయింపు

**30 ఏళ్ల సమస్యకు పరిష్కారం... సభ్యుల హర్షం**



వధశాలను ప్రారంభిస్తున్న దృశ్యం

**మక్తల్ టౌన్, 19 ప్రభాతవార్త:** మక్తల్ పట్టణంలోని కటిక సంఘానికి గత 30 ఏళ్లుగా వదశాల స్థలం లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ సమస్యను రాష్ట్ర మంత్రివర్యులుడా. వాకిటి శ్రీహరి దృష్టికి తీసుకెళ్లగా, ఆయన వెంటనే స్పందించి పరిష్కారం చూపారు. మంత్రి చొరవతో ప్రభుత్వానికి చెందిన సుమారు 12,000 గజాల స్థలాన్ని వదశాల నిర్మాణానికి కేటాయించారు. అంతేకాకుండా అక్కడ బోరు, మోటర్ సౌకర్యాన్ని కూడా ఏర్పాటుచేశారు. ఆ స్థలంలో నూతనంగా నిర్మించిన వదశాలను నేడు ఘనంగా ప్రారంభించారు. సమస్యను పరిష్కరించి సౌకర్యం కల్పించినందుకు కటిక సంఘం సభ్యులు మంత్రివర్యులు డా. వాకిటి శ్రీహరికి కృతజ్ఞతలు తెలిపి హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ వాకిటి మానస హనుమంతు వార్డు కౌన్సిలర్లు విద్యనీల గౌడ్, రహీం పటేల్, వెంకటేష్, కాంగ్రెస్ నాయకులు అమర్ రెడ్డి, కట్టా సురేష్ కుమార్, ఏఎంసి డైరెక్టర్లు శ్రీనివాసులు, ఆంజనేయులు, రంజిత్ రెడ్డి, మొహమ్మద్ ఫయాజ్, వాకిటి శ్యామ్, శంకర్, మూర్తి, టైలర్ జమీర్, కటిక సంఘం సభ్యులు మిర్చి ఇస్మాయిల్, జక్రియ, సద్దాం తదితర స్థానికులు పాల్గొన్నారు.

## నేడు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

**మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బి.ఆనంద్**

**దామరగిద్ద, జులై 19 ప్రభాతవార్త :** దామరగిద్ద మండల కేంద్రంలోని రైతు వేదికలో నేడు ఉదయం 10 గంటలకు కళ్యాణలక్షి ్మ, షాదీ ముబారక్ పథకాల చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బి. ఆనంద్ తెలిపారు. ఎమ్మెల్యే చిట్టెం పర్ణిక రెడ్డి, మాజీ డీసీసీ అధ్యక్షుడు కుంభం శివకుమార్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఏఎంసీ చైర్మన్ సదాశివ రెడ్డి, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు, హాజరుకానున్నట్లు తెలిపారు.

# పాత పెన్షన్ పునరుద్ధరణకు పోరాటం

**కొత్త పెన్షన్ విధానంతో ఉద్యోగుల భవిష్యత్తు ఆర్థికంగా అసురక్షితం : రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ**



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న తెలంగాణ రాష్ట్ర కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయిన్ యూనియన్ నాయకులు

**నారాయణపేట, జులై 19 ప్రభాతవార్త :** నారాయణ పేట జిల్లాలో పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రాష్ట్ర కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో జన జాగరణ యాత్ర నిర్వహించారు. ముందుగా బైక్ ర్యాలీ నిర్వహించి, అనంతరం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గంగాపురం స్థితప్రజ్ఞ మాట్లాడుతూ, కొత్త పెన్షన్ విధానం కారణంగా ఉద్యోగులు పదవీ విరమణ అనంతరం తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 30 సంవత్సరాలు సమాజానికి సేవ చేసిన ఉపాధ్యాయుడికి వృద్ధాప్యంలో కేవలం రూ.3 వేల పెన్షన్ మాత్రమే రావడం బాధాకరమని అన్నారు. కొత్త పెన్షన్ విధానం ఉద్యోగులకు ఎలాంటి భద్రత కల్పించడం లేదని, ఇతర రాష్ట్రాల మాదిరిగా తెలంగాణలో కూడా పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్, జార్ఖండ్, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాల్లో పాత పెన్షన్ విధానం అమలులో ఉందని గుర్తుచేస్తూ, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు తెలంగాణలో కూడా పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. ఆగస్టు 23న నిర్వహించే "చలో హైదరాబాద్" మహాసభకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రతి సిపిఎస్ ఉద్యోగి భారీ సంఖ్యలో తరలిరావాలని స్థితప్రజ్ఞ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర కోశాధికారి నరేష్, రాష్ట్ర కార్యదర్శి భాస్కర్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్వల్ శ్రీకాంత్, నారాయణపేట జిల్లా అధ్యక్షుడు కృపాకర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రాఘవేంద్రాచారి, ఎం.నరసింహారెడ్డి, సత్యపాల్, ఎం.జనార్ధన్ రెడ్డి, షేర్ కృష్ణారెడ్డి, దామోదర్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ

## వాటర్ పంప్ హౌస్‌ను పరిశీలించిన మున్సిపల్ చైర్‌పర్సన్

**తాగునీటి సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశం**



వాటర్ పంప్ హౌస్‌ను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

**నారాయణపేట, జులై 19 ప్రభాతవార్త :** నారాయణపేట మున్సిపల్ చైర్‌పర్సన్ కొండ శ్వేత సత్య యాదవ్ ఆదివారం సింగారం సమీపంలోని వాటర్ పంప్ హౌస్‌ను సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా పంప్ హౌస్‌లోని నీటి సరఫరా, పంపింగ్ వ్యవస్థను స్వయంగా పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పట్టణ ప్రజలకు నిరంతరాయంగా తాగునీటి సరఫరా అందేలా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు పంప్ హౌస్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు ఎప్పటికప్పుడు శుభ్రపరిచే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అలాగే నీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రస్తుతం నారాయణపేట పట్టణానికి రోజుకు సుమారు 6.6 ఎంఎల్‌డీ తాగునీటి సరఫరా జరుగుతోందని తెలిపారు. ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా మున్సిపాలిటీ తరఫున అన్ని చర్యలు చేపడుతున్నామని చైర్‌పర్సన్ పేర్కొన్నారు. ప్రజలు కూడా నీటిని వృథా చేయకుండా పొదుపుగా వినియోగించి, నీటి విలువను గుర్తించి మున్సిపాలిటీకి సహకరించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ విజ్ఞప్తి చేశారు.

## లోకకళ్యాణం కోసమే చండీయాగాలు



యాగ కార్యక్రమాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

**కల్వకుర్తి, జూలై 19 ప్రభాతవార్త:** కల్వకుర్తి పట్టణంలో కృష్ణ పీఠాధిపతి శ్రీ శ్రీ శ్రీ కృష్ణాదిత్య స్వరూపానంద స్వామి ఆధ్వర్యంలో శ్రీ కృష్ణ కాలచక్రం విష్ణు పంచాయతనం ఆయుత చండీ అతిరుద్రం సీతారామ సామ్రాజ్య పట్టాభిషేకం 91వ విశ్వశాంతి మహాయాగం భక్తి శ్రద్ధలతో ఆదివారం వైభవంగా ప్రారంభమైంది. మహాయాగ కార్యక్రమానికి కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించి యాగాన్ని ప్రారంభించారు. ఆధ్యాత్మిక శోభతో యాగం ప్రారంభం 15 రోజులపాటు నిర్వహించే ఆయుత చండీయాగం ఆధ్యాత్మిక శోభతో ప్రారంభించారు. ఉదయం గణపతి పూజ, శుద్ధి పుణ్యాహవాచనం, పంచ గవ్య ప్రాసన రుత్విక్ వరణ గో సహిత యాగశాల, ప్రవేశం ,అఖండ జ్యోతి స్థాపన ప్రధాన మఠారాధన, కలశ శంకుస్థాపన, ధ్వజారోహణ కార్యక్రమాలను వేదమంత్రాలు మధ్య నిర్వహించారు. వేదపండితుల ఆశీర్వాదాలు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ, విశ్వశాంతి, లోకకళ్యాణం, మానవాళి సంక్షేమం, దేశ సుభిక్షం కోసం నిర్వహించే చండీయాగాలకు విశిష్టమైన ఆధ్యాత్మిక ప్రాధాన్యం ఉందన్నారు. ప్రపంచవ్యాప్తంగా నెలకొంటున్న ప్రకృతి వైపరీత్యాలు, విపత్తులు, వ్యాధులు, అశాంతి వంటి ప్రతికూల పరిస్థితులు తొలగి సమస్త మానవాళికి శాంతి, సౌభాగ్యం, ఆయురారోగ్యాలు చేకూరాలని సంకల్పంతో ఈ మహాయాగం నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఇటువంటి యాగాలు ప్రజల్లో ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించడంతో పాటు సనాతన ధర్మ పరిరక్షణకు దోహదపడతాయని అన్నారు. కల్వకుర్తి నియోజకవర్గంతో రాష్ట్రం, దేశం సుభిక్షంగా ఉండాలని, రైతులకు సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని, ప్రజలందరూ సుఖశాంతులతో జీవించాలని యాగంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఏసీ సభ్యులు ఠాకూర్ బాలాజీ సింగ్, మున్సిపల్ చైర్మన్ బృంగి రత్నమాల, మాజీ సర్పంచ్ ఆనంద్ కుమార్, ప్రముఖ పారిశ్రామికవేత్త జూలూరు రమేష్ బాబు, నిర్వాహకులు జూలూరి ప్రకాష్, మదన మురళి, రాహుల్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రమాకాంత్ రెడ్డి, కౌన్సిలర్ రాజేష్ కుమార్, సంతు యాదవ్, బొమ్ము ఆంజనేయులు, పడకంటి వెంకటేష్, దున్న భాస్కర్ పట్టణ, మండలాల ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, వేదపండితులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



కార్యక్రమాలను ప్రారంభిస్తున్న శ్రీ శ్రీ శ్రీ కృష్ణాదిత్య స్వరూపానంద స్వామి

## గడువులోపు డిజిటలైజేషన్ పూర్తి చేయాలి

**అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ ఆదేశం**

**మహబూబ్‌నగర్ లో ఎన్యుమరేషన్ ప్రక్రియ పరిశీలన**



డిజిటలైజేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

**మహబూబ్‌నగర్, జులై19, ప్రభాతవార్త:** నిర్ణీత గడువులోగా డిజిటలైజేషన్ పనిని పూర్తిచేయాలని మహబూబ్‌నగర్ అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మహబూబ్‌నగర్ జిల్లాలోని ఏనుగొండలో, లక్ష్మీనగర్ కాలనీలలో ఎస్ఐఆర్ 2026 ఫారమ్‌ల డిజిటలైజేషన్ ప్రక్రియను అదనపు కలెక్టర్ పరిశీలించారు. ఈ పర్యటనలో భాగంగా ఎస్ ఐ ఆర్ ఫారమ్‌ల డిజిటలైజేషన్ పురోగతిని సమీక్షించి, జరుగుతున్న పని నాణ్యత మరియు ఖచ్చితత్వాన్ని పరిశీలించారు. అలాగే ఈ ప్రక్రియలో నిమగ్నమైన అధికారులు, సిబ్బందితో మాట్లాడారు. అత్యున్నత స్థాయి ఖచ్చితత్వం, పారదర్శకత, డేటా సమగ్రతను పాటిస్తూ, నిర్ణీత గడువులోగా డిజిటలైజేషన్ పనిని పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో భాగంగా వివిధ గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన రాజకీయ పార్టీల ప్రతినిధులు ఎస్ఐఆర్ 2026 కార్యక్రమం పోలింగ్ కేంద్రాల ఏర్పాట్లకు సంబంధించిన అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కిరన్, మండల గిర్దావర్ నర్సింగ్ పాల్గొన్నారు.

## ఓయులో ఉద్యమకారుల సమ్మేళనం..

**కేకే కమిటీని స్వాగతిస్తూ.. రేవంత్ రెడ్డి పై ప్రేమ యుద్ధం!**

**ఓయూ,పియు జేఏసీ నాయకులు పిడమర్తి రవి,సింగరిగల్ల బ్రహ్మ**



ఉస్మానియా యూనివర్సిటీలో రెండు తరాల ఉద్యమకారుల సమ్మేళనం

**చిన్నంబావి, జులై 19 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్రంలో అన్ని యూనివర్సిటీ ల జాయింట్ యాక్షన్ కమిటీ ప్రతినిధులు ఆదివారం ఓయు లో హాజరు కావడం జరిగింది. వనపర్తి జిల్లా చిన్నంబావి మండలానికి చెందిన పాలమూరు యూనివర్సిటీ నాయకుడు సింగరిగల్ల బ్రహ్మ ఆధ్వర్యంలో తెలంగాణ ఉద్యమంలో పనిచేసిన విద్యార్థి, ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం కేటాయించాలని అదేవిధంగా ఉద్యమకారులకు పింఛన్ గుర్తింపు కార్డు ఇవ్వాలని ఉస్మానియా యూనివర్సిటీ లో తెలంగాణ ఉద్యమకారుల సంఘం వ్యవస్థపాకులు పిడమర్తిరవి ఆధ్వర్యంలో రెండుతరాల ఉద్యమకారుల సమ్మేళన సమావేశంలో ముఖ్య అతిథులుగా హాజరై పలువురు ప్రసంగించారు. పిడమర్తి రవి తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి ప్రభుత్వం కేకే కమిటీ వేయడానికి స్వాగతిస్తూ.. 250 గజం స్థలం వెంటనే కేటాయించాలని తెలంగాణ విద్యార్థి జెఎసి చైర్మన్ ఆధ్వర్యంలో ఆర్ట్స్ కాలేజ్ వేదికగా ఓయూ జేఏసీ నాయకులతో ప్రెస్ మీట్ పెట్టడం జరిగింది. భవిష్యత్తు కార్యాచరణ గురించి చర్చించుకోవడం జరిగింది. 1969లో ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం ఉద్యమంలో పాల్గొన్నటువంటి ప్రతి ఒక్కరిని భాగస్వామ్యం చేసుకొని ఉద్యమ కార్యచరణ ప్రకటించబోతున్నాం అని పిడమర్తి రవి మాట్లాడడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాస వెంకట్, సాంబశివ గౌడ్, ఎండి రహీం.వేల్పుల కుమార్, మదిలేటి మధు,, దాత్రిక స్వప్న, రేష్మ, శంకర్‌నాయక్, ఎండలప్రదీప్, బైరు నాగరాజ్‌గౌడ్, శ్రీశైలం గౌడ్, సంపత్ నాయక్, గద్దల అంజిబాబు, హిందోల్ రాథోడ్. తాండూరు శీను, సంజయ్‌గౌడ్, అందేకృష్ణ, జాన్‌దర్శన్, తోము నవీన్ యాదవ్, కత్తి సైదులు, స్పోర్ట్స్ ప్రవీణ్, అల్లుడు జగన్, తెలంగాణ సంపత్. పాలమూరు యూనివర్సిటీ సింగర్గాళ్ళ బ్రహ్మం, బోరెల్లి సురేష్ నాచ శ్రీనివాస్ యాదవ్, ఉపేందర్, రామగళ్ళ సుందర్, మొగిలిగిద్ద ప్రసాద్, తీగల శ్యామ్, శ్రీశైలం శ్రీకాంత్ తెలుగు యూనివర్సిటీ మంచాల మహేష్ హాజరై భవిషత్ కార్యాచరణకు మద్దతు ఇచ్చారు.

## సీసీ రోడ్డు పనులు ప్రారంభం



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న దృశ్యం

**కోయిలకొండ జులై 19, ప్రభాతవార్త :** మండల పరిధిలోని ఇబ్రహీం నగర్ గ్రామంలో ఆదివారం గ్రామ సర్పంచు లక్ష్మీ శ్రీనివాసులు ఎన్ఆర్ఈజీఎస్ నిధుల నుండి సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో అన్ని వార్డులలో సీసీ రోడ్లు ,డ్రైనేజీ నిర్మాణాలు చేపట్టి గ్రామాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తామన్నారు. గ్రామస్తులందరి సహకారంతో గ్రామాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేయడమే నా ముందున్న లక్ష ్యం అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ అలివేల శేఖర్, గ్రామ పెద్దలు టి నరసింహులు, గోపాల్, శ్రీనివాసులు, చెన్నయ్య, బాలరాజు, వీరేష్, వార్డు సభ్యులు, యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## అనాథలకు ఆప్తుడు పద్మశ్రీ కిన్నెర మొగులయ్య



నూతన వస్త్రాలు అందించిన పద్మశ్రీ మొగులయ్య

**అచ్చంపేట, జులై, 19 ప్రభాతవార్త:** మతిస్థిమితం లేకుండా అనాథలుగా వీధుల్లో రోడ్లపై తిరుగుతున్న వారికి పద్మశ్రీ మొగులయ్య గుర్తించి సేవలందిస్తున్నారు. ఆదివారం అచ్చంపేట పట్టణంలో అంబేద్కర్ కూడలి వద్ద ఓ వ్యక్తి మతిస్థిమితం లేకుండా తిరుగుతున్న విషయాన్ని గమనించి వెంటనే నూతన వస్త్రాలు కొనుగోలు చేసి అతనికి ధరించడం జరిగింది. ఆయన మాట్లాడుతూ మతిస్థిమితం లేకుండా అనాథలుగా ఉన్న వారికి సేవలు చేయడం ఆనందంగా ఉంది అని పద్మశ్రీ మొగులయ్య తెలిపారు. ఇప్పటికీ చాలామందికి క్షవరాలు చేయించి నూతన వస్త్రాలు ఇప్పించడం జరిగిందని తెలిపారు. అలాంటి వారికి సేవ చేయడము అదృష్టంగా భావిస్తున్నానని ఆయన అన్నారు.

## గోవును జాతీయ జంతువుగా ప్రకటించాలని సంతకాల సేకరణ



సంతకాల సేకరణ చేస్తున్న బజరంగ్‌దళ్ నాయకులు

**నారాయణపేట, జులై 19 ప్రభాతవార్త :** గోవును జాతీయ జంతువుగా ప్రకటించాలని, గోవధను నిషేధించాలని కోరుతూ పేట జిల్లా కేంద్రంలోని సత్యనారాయణ చౌరస్తాలో విశ్వహిందూ పరిషత్ (విహెచ్‌పీ), బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గోరక్ష జిల్లా ప్రముఖ్ మిస్కిన్ సందీప్ మాట్లాడుతూ గో సంరక్షణకు సంబంధించిన చట్టాలను మరింత పటిష్టం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. గో సేవకు చట్టబద్ధత కల్పించి, ప్రత్యేక గో సంరక్షణ విభాగాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో సుమారు 1,200మంది పాల్గొని గోసం రక్షణకు మద్దతుగా సంతకాలు చేశారు. ఈకార్యక్రమంలో విహెచ్‌పీ జిల్లా కార్యదర్శి కన్న శివకుమార్, నగర గోరక్ష ప్రముఖ్ అనిల్, పట్టణ అధ్యక్షుడు మురళి భట్టడ్, జిల్లా బజరంగ్ సంయోజక్ శ్రావణ్, ఆకాష్, చక్రి, చరణ్, అరవింద్, రాజశేఖర్, రాఘవ, నరసప్ప తదితరులు పాల్గొన్నారు.

## అనారోగ్యం బారిన పడ్డ తోటి మిత్రునికి ఆర్థిక సహాయం

**కోయిలకొండ జులై 19, ప్రభాతవార్త :** కోయిలకొండ మండలం గార్లపాడు గ్రామ 1992. 1993 పదవ తరగతి బ్యాచ్ కు చెందిన వెంకట్ రామ్ రెడ్డి అనారోగ్యానికి గురికావడంతో విషయం తెలుసుకున్న తోటి మిత్రులు ఆదివారం వెంకటరామిరెడ్డి ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని రూపాయలు 71,716 ఆర్థిక సహాయం అందజేశారు. అందరితో కలిసిపోయే వ్యక్తి వెంకటరామిరెడ్డి త్వరగా కోలుకోవాలని 1992.1993 పదవ తరగతి బ్యాచ్ కు చెందిన మిత్రులు ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి వెంకట్రామిరెడ్డి తో కాసేపు గడిపి వెళ్లారు. ఈ కార్యక్రమంలో పదవ తరగతి కి చెందిన స్నేహితులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియ వేగవంతం చేయాలి

**పారదర్శకంగా, తప్పులు లేకుండా ఉండాలి**

**నిర్లక్ష్యం చేస్తే ఓటు పోయే ప్రమాదం : ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి**

**మహబూబ్‌నగర్, జులై 19 ప్రభాతవార్త:** నగరంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రెవిషన్ ) ప్రక్రియపై ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి నగర కార్పొరేటర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి కార్పొరేటర్ తమ డివిజన్‌లో ప్రతి ఇంటికి వెళ్లి ఎస్ ఐ ఆర్ ఫారాలు నింపించడంలో ప్రజలకు సహకరించాలని సూచించారు. ఓటర్లలో


అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే యెన్నం

అవగాహన కల్పించడం అత్యంత అవసరమని తెలిపారు. ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా ఓటర్లు తమ ఓటు హక్కును కోల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరించిన ఆయన, ఒక్క ఓటరు కూడా ఓటు కోల్పోకుండా ప్రతి ఇంటిని సందర్శించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో నగర మేయర్ గుమ్మాల మమత శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి, ముడా చైర్మన్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు లక్ష్మణ్ యాదవ్, డిసిసి ప్రధాన కార్యదర్శి రాములు యాదవ్, పట్టణ కాంగ్రెస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు అజ్మత్ అలీ, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

## ఎల్‌నినో పరిస్థితులపై సమీక్ష

**హాజరు కానున్న ఇంఛార్జి మంత్రి దామోదర రాజనర్సింహ**



**మహబూబ్‌నగర్, జులై 19 ప్రభాతవార్త :** ఎల్‌నినో పరిస్థితులపై సోమవారం జిల్లా ఇంచార్జి మంత్రి,రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, మంత్రులు, ప్రజా ప్రజా ప్రతినిధులు ఉమ్మడి మహబూబ్ నగర్‌జిల్లా కలెక్టర్‌లు,అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. మహబూబ్‌నగర్ కలెక్టరేట్ లో నిర్వహించనున్న కీలక సమావేశంలో జిల్లా ఇంచార్జి మంత్రి, ప్రజాపతినిధులకు అధికారులకు దిశానిర్దేశం చేయనున్నారు. జిల్లా ఇంఛార్జి మంత్రి దామోదర రాజనర్సింహ,ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి, ఎంపిలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యే లు,కార్పొరేషన్ చైర్మన్ లు,మహబూబ్ నగర్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉదయం 11 గంటలకు ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా అధికారులతో సమావేశమై ఎల్‌నినో పరిస్థితులపై సమగ్రంగా చర్చించనున్నారు. తక్కువ వర్షపాతం అవకాశం, తాగునీటి నిర్వహణ, వ్యవసాయం, సాగునీరు, పశుసంవర్ధక, వైద్య ఆరోగ్య, విద్యుత్, విపత్తు నిర్వహణ తదితర శాఖలు తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై అధికారులకు జిల్లా ఇంచార్జి మంత్రి ,మంత్రులు,ప్రజా ప్రతినిధులు దిశానిర్దేశం చేయనున్నారు. సమావేశానికి జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు.

## ఉచిత వైద్య సేవలకు గుర్తింపు

**లయన్స్ క్లబ్ ఆఫ్ మక్తల్ భీమా సభ్యులు డా.మణికంఠ గౌడ్ కు సన్మానం**

**మక్తల్ టౌన్, జులై 19 ప్రభాతవార్త :** లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 320ఏ 2006,2007 ఆధ్వర్యంలోని డాక్టర్స్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో హైదరాబాద్ లోని విహాన్ బ్యాంక్విట్ హాల్‌లో వైద్యుల సన్మాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఉచిత వైద్యశిబిరాలు,సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న వైద్యులను అభినందించేందుకు ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో భాగంగా లయన్స్ క్లబ్ ఆఫ్ మక్తల్ భీమా సభ్యులు డా. మణికంఠగౌడ్‌ను సన్మానించారు. డిస్ట్రిక్ట్ గవర్నర్



మణికంఠగౌడ్‌ను సన్మానిస్తున్న దృశ్యం

లయన్ జిజ్ఞాని, మాజీ డిస్ట్రిక్ట్ గవర్నర్ జి.మహేందర్ కుమార్ రెడ్డి, అచంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ చేతుల మీదుగా డా.మణికంఠ గౌడ్ ను శాలువాతో సత్కరించి ప్రశంసాపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ మక్తల్ భీమా కార్యదర్శి లయన్ ఎస్. రమేష్ రావు, అధ్యక్షులు నాగరాజ్, ట్రెజరర్ అంబదాస్, మాజీ అధ్యక్షులు, కార్యదర్శులు మరియు క్లబ్ సభ్యులు పాల్గొని డా. మణికంఠ గౌడ్ ను అభినందించారు. ఉచిత వైద్య సేవల ద్వారా పేదలకు అండగా నిలుస్తున్న డాక్టర్ల సేవలను గుర్తించి ఇలాంటి సన్మానాలు చేయడం స్ఫూర్తిదాయకమని కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు పేర్కొన్నారు.

## తెలంగాణలో వరుసగా కార్యక్రమాలు పూర్తి చేసిన క్లాస్మేట్ క్లబ్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూలై 19 ప్రభాతవార్త:** క్లాస్మేట్ క్లబ్ తెలంగాణ ఆధ్వర్యంలో "365 రోజులు - 365 కార్యక్రమాలు" అనే వినూత్న కార్యక్రమంలో భాగంగా జనవరి 1, 2026 నుంచి జూలై 19, 2026 వరకు వరుసగా 200 కార్యక్రమాలు విజయవంతంగా క్లాస్మేట్ క్లబ్ పూర్తి చేశారు. ఈ సందర్భంగా 200వ రోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా తొలి స్వతంత్ర సమరయోధుడు మంగళ్ పాండే జయంతిని


క్లబ్ సభ్యులను సన్మానిస్తున్న దృశ్యం

పురస్కరించుకుని పలు సేవా కార్య క్రమాలు చేపట్టారు. అందులో భాగంగా ఒక పేద విద్యార్థికి రూ.5,000 ఆర్థిక సహాయం అందజేయడంతో పాటు, ఎంసెట్‌లో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను సన్మానించారు. అలాగే కుడికిళ్ల పాఠశాలకు పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా క్లాస్మేట్ క్లబ్ వ్యవస్థాపకులు వాస రాఘవేందర్ మాట్లాడుతూ గత 200 రోజులుగా ప్రతి రోజు తెలంగాణలోని వివిధ ప్రాంతాల్లో విభిన్న సామాజిక, విద్యా, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం, మోటివేషన్ తరగతులు, ప్రతిభా పోటీలు, వైద్యులను సన్మానించడం వంటి అనేక కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సి. రమణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు లక్ష్మి రాఘవేందర్, ప్రతినిధులు కె. లక్ష్మణ్, రవిప్రకాశ్, యాదయ్య, పాండు, స్వామి, ప్రమోద్, విజయ్, లక్ష్మి, సంబు, శ్రీను, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ హాస్టల్ సమస్యలు పరిష్కరించాలి

**చిన్నంబావి, జులై 19 ప్రభాతవార్త :** చిన్నంబావి మండల పరిధిలోని కొప్పునూరు గ్రామంలో ఉన్న ఎస్సీ హాస్టల్ లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని సిపిఎం చిన్నంబావి మండల నేతలు డిమాండ్ చేశారు. ఆదివారం మండల పరిధిలోని కొప్పునూరు ఎస్సి హాస్టల్‌ను సందర్శించి,విద్యార్థులతో సిపిఎం నేతలు మాట్లాడటం జరిగింది. ఈ సందర్భంగా


హాస్టల్ సమస్యలను తెలుసుకుంటున్న సిపిఎం నాయకులు

సిపిఎం పార్టీ నేతలు ఎం.ఆది,బి.కుమార్ మాట్లాడుతూ హాస్టల్ ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నా, ప్రభుత్వం సమస్యల పరిష్కారానికి నోచుకోలేదని అన్నారు. నేటికీ యూనిఫామ్స్,నోట్ బుక్స్ అంద చేయలేదని, ప్రభుత్వం హాస్టల్లో నెలకు ఒకసారి విద్యార్థులకు మెడికల్ చెకప్ నిర్వహించాలని, ఉన్న నేటికీ విద్యార్థులకు హెల్త్ క్యాంపులు నిర్వహించకపోవడం సిగ్గుచేటు అన్నారు. విద్యార్థులకు ఆట వస్తువులు ఏర్పాటుచేసి, ట్యూటర్ ను నియమించాలని అన్నారు.ఇన్వేటర్,స్వీపర్, నైట్ వాచ్ మెన్‌ను,మూత్రశాలలు,మరుగుదొడ్ల కు లైట్స్ ఏర్పాటు చేయాలని, గత సంవత్సరం నవంబర్ నుంచి నేటికి విద్యార్థులకు అందాల్సిన కాస్మోటిక్ చార్జీలు అందకపోవడం ఏంటని ప్రశ్నించారు. తక్షణమే హాస్టల్ సమస్యలు పరిష్కరించే విధంగా ఉన్నతాధికారుల పర్యవేక్షణ ఉండాలని వారు డిమాండ్ చేశారు. హాస్టల్ సందర్శించిన వారిలో సిపిఎం పార్టీ నేతలు బాలస్వామి,మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎంబీబిఎస్ పూర్తి చేసి ఆదర్శంగా నిలవాలి

**మాజీ జడ్పీటీసీ కృష్ణయ్య యాదవ్**

**మదనాపురం,జులై 19 ప్రభాతవార్త ;**నీట్‌లో మంచి ర్యాంకును సాధించిన సంజన ఎంబిబిఎస్ పూర్తిచేసి వైద్యసేవలో అందరికి ఆదర్శంగా నిలవాలని మాజీ జడ్పీటిసి కృష్ణయ్యయాదవ్ అన్నారు. ఆదివారం మండలంలోని కొత్తపల్లిలో మండల బిఆర్ఎస్ నాయకులు అనిమోని రమశ్రీ మాసన్న కూతురు సంజన నీట్ పరీక్షల్లో మంచి ర్యాంకును సాధించి ప్రభుత్వ మెడికల్ కాలేజీలో సీటు సాధించినందున శాలువాలతో ఘనంగా సత్కరించారు.అనంతరం సంజన తల్లిదండ్రులు అనిమోని రమశ్రీ మాసన్నను కొనియాడుతూ అభినందించారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షులు బిట్లి యాదగిరి,మాజీ సర్పంచులు కోట్ల తిరుపతయ్య, గోపన్ పేట ఆంజనేయులు,కొత్తపల్లి రమేష్, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ దేశి వెంకటేష్ యాదవ్, నాయకులు రామన్ పాడ్ రాములు, చాయ్ క్లబ్ రాములు,ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు మనోజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఆదేశాలు ఇచ్చిన ఆగని చౌదూర్ క్రషర్ బ్లాస్టింగులు..

# భయాందోళనలో గ్రామస్తులు


క్రషర్ మిషన్ నడిపిస్తున్న దృశ్యం

**కోర్టు ఆదేశాలు బేఖాతరు చేస్తున్న క్రషర్ యజమానులు**

**కలెక్టరమ్మ కరుణించమ్మ,**


**చుట్టుపక్కల గ్రామాల ప్రజల వేడుకోలు**

**ప్రజల ఆవేదన అధికారులకు అర్థం కాదా?**

**నవాబుపేట,జులై 19 ప్రభాతవార్త :** మహబూబ్‌నగర్ జిల్లా నవాబు పేట మండల పరిధిలోని చౌదూరు గ్రామ పరిధిలో వెలసిన క్రషర్ వెంటనే నిలిపేయాలని రెండు మూడు గ్రామ పంచాయతీలు నోటీసులు ఇచ్చిన ప్రజల మొర వినకుండా క్రషర్ పై చర్యలు తీసుకోకుండా ఆదేశాలిచ్చిన పనులు ఆపకుండా భారీ శబ్దాలతో బ్లాస్టింగ్లు చేపట్టడంతో అధికారులపై చుట్టుపక్కల గ్రామాల రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.నవాబుపేట్ కొందూరు మెయిన్ రోడ్డు రహదారి పక్కనే ఉన్న క్రషర్ ఈ ప్రాంతంలో మొక్కలు నాటి కాలుష్యాన్ని నియంత్రించాలనే నిబంధనలు ఉన్నాయి. కోర్టు పనులు జరగకుండా ఆదేశాలు ఇచ్చినా కోర్టు ఆదేశాలను దిక్కరించి భారీ బ్లాస్టింగ్లు నిర్వహిస్తూ ప్రజల జీవనోపాధిపై క్రషర్ మిషన్ దెబ్బ కొడుతుందని గ్రామస్తులు రైతులు వాపోతున్నారు. అదేవిధంగా ఈ ప్రాంతంలో కాలు ష్యాన్ని కొలిచే యంత్రాలను ఏర్పాటు చేసి, దుమ్ము దూళి రాకుండా ఎప్పుడు నీటిని వెదజల్లేలా దుమ్ము గాలిలోకి లేవకుండా క్రషర్ ప్రత్యేక ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది. కానీ నవాబుపేట మండలంలో ని చౌదూరు గ్రామ సమీపంలో కొంతమంది క్రషర్ నిర్వా హకులు నిబంధనలను గాలికి వదిలేసి అక్రమంగా బ్లాస్టింగ్ లు చేయడం వల్ల చౌదూరు గ్రామం చుట్టుపక్క గ్రామాలలో దుమ్ము ధూళి ఆవహించటం వలన ప్రజలు వివిధ రోగాల బారిన పడుతున్నారనీ చౌదూరు గ్రామ ప్రజలు చుట్టూ ఉన్న భూముల రైతులు ఎన్నిసార్లు మొరపెట్టుకున్న మండల అధికారులు కానీ జిల్లా యంత్రాంగం కానీ మైనింగ్ అధికారులు


క్రషర్ బ్లాస్టింగ్లతో తండాలో అలుముకున్న దుమ్ము దూళి

కానీ చర్యలు తీసుకోలేకపోవడంపై ప్రజలు యంత్రాంగంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. చుట్టుపక్కల గ్రామస్తులు చౌదూరు గ్రామపంచాయతీ , మురంబాయ్ తాండ గ్రామస్తులు ఆందోళన చేపట్టి పంచాయతీ సెక్రెటరీ సర్పంచ్ యజమానులకు నోటీసులు జారీ చేసిన ఇవేమీ మాకు పట్టనట్లు క్రషర్ బ్లాస్టింగులు జరుపుతూనే ఉన్నారు. క్రషర్ యజమానులకు అనుమతులు లేకుండా నడుస్తున్న క్రషర్ను ఆపాలని నోటీసులు జారీ చేశారు.


In view of the above circumstances, as per the report submitted by the Environmental Engineer, Telangana Pollution Control Board, Regional Office, Hyderabad, it is to inform that the quarry is sufficiently far from adjacent Human habitations so as to mitigate potential environmental and health impacts.

Further, the crusher is presently stopped/not working and will be op erated only after obtaining valid CFO from Pollution Control Board (PCB). According ly, the representation dt.22.12.2023 is here by disposed.

Yours faithfully,
Dy.Director of Mines and Geology (FAC),
Hyderabad.

Copy submitted to the Director of Mines and Geology, Hyderabad for favour of information.
Copy to the Asst.Director of Mines and Geology, Mahabubnagar for information and with a direction to serve the copy of letter to the petitioner through special messanger and submit the acknowledgement.

కోర్టు ఇచ్చిన ఉత్తర్వులు

**పంట పొలాలకు నష్టం....**

చుట్టుపక్కల ఉన్న పొలాలు కూడా పంటలు దెబ్బతింటున్నాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. నిబంధనలను పట్టించుకోకుండా నిర్వహిస్తున్న క్రషర్ ను వెంటనే సీజ్ చేసి ప్రభుత్వ సంపదను రావాల్సిన కోట్లరూపాయల సంపదను ఆవిరి చేస్తున్నారని వాపోతున్నారు.

**క్రషర్ యజమానులపై చర్యలు తీసుకోండి...**

మండలంలోని చౌదూరు గ్రామపంచాయతీ పరిధిలోని క్రషర్‌లో భారీగా బ్లాస్టింగ్ జరుగుతున్నాయని తాము దుమ్ము దూలికి అక్కడ ఉండలేకపోతున్నామని బ్లాస్టింగ్ శబ్దాలతో రైతుల పంట పొలాల బోర్లు ధ్వంసం అవుతున్నాయని సమీప ఇండ్లకు పగుళ్లు ఏర్పడుతున్నాయని చుట్టుపక్కల గ్రామాల రైతులు ఆరోపిస్తున్నారు. బ్లాస్టింగ్ జరిగిన ప్రతిసారి గ్రామంలోని అన్ని నివాస గృహాలు కాలుష్యంతో దుమ్ము ధూళితో నిండిపోవడమే కాకుండా,పెద్ద శబ్దం రావడంతో, ఇండ్లు కదిలి శిథిలావస్థకు చేరుకుంటున్నాయన్నారు. క్రషర్ దుమ్ము దులితో బ్లాస్టింగ్లతో ప్రజలంతా తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నామని సంబంధిత క్రషర్ యజమానుల పైన సంబంధిత అధికారులు చర్యలు తీసుకో వాలని తమను, తమ గ్రామాన్ని రక్షి ంచాలని కోరుకుంటున్నారు.

**ప్రభుత్వ నిబంధనలు ఇలా.....?**

స్టోన్ క్రషర్ ఏర్పాటు చేయడానికి, నడపడానికి ప్రభుత్వం నుండి నిర్దిష్ట అనుమతులు తప్పనిసరి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం భూగర్భధనులు,కాలుష్య నియంత్రణ మండలి,మరియు స్థానిక సంస్థల అనుమతులుతీసుకోవాలి. జిల్లాకలెక్టర్,ఇతర విభాగాలు భూముల కేటాయింపు మరియు ఇతర పరిశ్రమల భద్రత నిబంధనలు ప్రకారం అదనపు అనుమతులు అవసరమవుతాయి. అనుమతులు లేకుండా క్రషర్లునడపడం చట్టరీత్యానేరం.క్రషర్ విషయంలో హైకోర్టులో కేసునడుస్తున్న క్రషర్ అనుమతులు లేకున్నా పనులు మాత్రం బ్లాస్టింగులు క్రషర్ పనులునడుపుతూ ప్రజల పంట పొలాలపై దుమ్ము ధూళి పేరి కాలుష్యంతో నిండిపోతున్నాయని రైతులు లబోదిబోమంటున్నారు. కోటి ఇచ్చిన ఆదేశాల ప్రకారం పనులు ఆపకుండా నిలిపివేయాలని విచారణ చేపట్టి అధ్యయశాలి వచ్చిన తర్వాత క్రషర్‌పనులు చేపట్టాలని కోర్టులో కేసు నడుస్తున్న కూడా కోర్టు ఆదేశాలను లెక్కచేయకుండా క్రషర్ నడుపుతున్నారని సమీప గ్రామ సర్పంచుల పంచాయతీకార్యదర్శుల నుండి అనుమతి లేకుండా క్రషర్‌పనులు సాగించడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి ఇప్పటికైనా సంబంధిత అధికారులు అక్రమంగా అనుమతులు లేని క్వారీలపై చర్యలు తీసుకొని తమ గ్రామాన్ని ప్రజలను ఇబ్బందులుపెట్టకుండా చూడాలని అధికారులను వేడుకుంటున్నారు.

# మెడికల్ క్యాంపునూ అడ్డుకుంటారా..?

**చిల్లర రాజకీయాలు మానుకోవాలి**

**సర్పంచుల సంఘం మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రణీల్ చందర్**

**జడ్చర్ల, జులై 19, ప్రభాతవార్త :** జడ్చర్ల మండలం నసురుల్లాబాద్ గ్రామంలో ఎస్‌విఎస్ హాస్పిటల్ వారి సౌజన్యంతో 12 రకాల వైద్య విభాగాలతో ప్రజలకు వైద్య పరీక్షల క్యాంపు నసురుల్లాబాద్ గ్రామ దేవాలయం పక్కన ఉన్న షెడ్ లో ఏర్పాటు చేస్తే సర్పంచ్ భర్త బాలస్వామి అడ్డు పడడం సరైంది కాదని మాజీ సర్పంచుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రణీల్ చందర్ అన్నారు. జడ్చర్ల లోని మాజీ మంత్రి లక్ష్మారెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. షెడ్డు కి తాళం వేయించి అడ్డుకున్నాడని, 2017లో నిర్మించిన ఈ షెడ్డులో ఇప్పటివరకు నాలుగు సార్లు మెడికల్ క్యాంపులు నిర్వహించడం జరిగిందన్నారు. గ్రామస్తులు ఒక్క రూపాయి లేకుండా ఇదే షెడ్డులో శుభకార్యాలు పుట్టినరోజు వేడుకలు, ఎంగేజ్మెంట్ కార్యక్రమాలు, స్కూల్ టీచర్ల రిటైర్మెంట్ కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది కానీ నేడు మెడికల్ క్యాంపు ని ఆపాలి అని ఒక దురుద్దేశంతో షెడ్డులో క్యాంపు నిర్వహించవద్దు అని తాళం వేయించడం ఎంతవరకు సమంజసం అన్నారు. ప్రజల కోసం క్యాంపు ఏర్పాటు చేయగా పోలీసులను గ్రామంలో తీసుకొచ్చి క్యాంపు నిర్వహించకుండా చేయడం ఏంటని


మాట్లాడుతున్న ప్రణీల్ చందర్

ప్రశ్నించారు. పార్టీలకతీతంగా ప్రజాప్రతినిధులు సేవలు చేయాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. ఎలాంటి హక్కు లేకుండా తాళం వేసి పోలీసులను కాపలాగా పెట్టడం అంటే అధికార దుర్వినియోగానికి పాల్పడడమే, స్థానిక సీఐ, డీఎస్పీకి ఫోన్లో సమాచారం అందిస్తే ఎవరు కూడా స్పందించకపోవడం సిగ్గుచేటన్నారు. సమాజాన్ని కాపాడాల్సిన పోలీసులు క్యాంపు ని అడ్డుకోవడంలో పాత్ర పోషించడం చాలా దురదృష్టకరం,ఇలాంటి చిల్లర రాజకీయాలు చేయడంతో నాలుగు గ్రామాల ప్రజలకు మేలు చేసే కార్యక్రమాన్ని సర్పంచ్ భర్త బాలస్వామి అడ్డు పడడం ఏంటి ప్రజలకోసం ఓట్లతో గెలిచిన వ్యక్తి ప్రజలకు మంచి చేసే బాధ్యత ఉండాలని మాజీ సర్పంచుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రణీల్ చందర్ మండిపడ్డారు. పోలీసులు భయభ్రాంతులకు గురి చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఇలాంటి చిల్లర రాజకీయాలు మానుకోవాలని హితవు పలికారు.

## రూ.50వేల విలువైన సెల్‌ఫోన్‌ను యజమానికి అప్పగింత

**ఆటో డ్రైవర్‌ను అభినందించిన ఎస్పీ డి.జానకి**

**మహబూబ్‌నగర్ క్రైమ్, జూలై 19 ప్రభాతవార్త:** ప్రయాణికుడు ఆటోలో ప్రయాణిస్తున్న సమయంలో ప్యాంటు జేబులో నుంచి జారిపడి సీటు పక్కనున్న సందులో పడిపోయిన సుమారు రూ.50 వేల విలువైన సెల్‌ఫోన్‌ను ఎలాంటి స్వార్థం లేకుండా పోలీసుల ద్వారా యజమానికి అప్పగించిన ఆటో డ్రైవర్ అబ్దుల్ హఫీజ్ నిజాయితీని మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ డి.జానకి అభినందించారు. ఆదివారం ఉదయం కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి వెంకట్ రాజు తెలంగాణ చౌరస్తా నుండి రైల్వే స్టేషన్‌కు ఆటోలో ప్రయాణించారు. ప్రయాణిస్తున్న సమయంలో ఆయన ప్యాంటు జేబులో ఉన్న సెల్‌ఫోన్ జారి ఆటో వెనుక సీటు పక్కనున్న సందులో పడిపోయింది. రైల్వే స్టేషన్ వద్ద ఆటో దిగిన అనంతరం కొంతసేపటికి తన సెల్‌ఫోన్ కనిపించకపోవడంతో, అది ఆటోలోనే మరిచిపోయినట్లు గుర్తించి మహబూబ్‌నగర్ టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉండగా, ప్రయాణికుడిని రైల్వే స్టేషన్ వద్ద దించిన అనంతరం ఆటో డ్రైవర్ అబ్దుల్ హఫీజ్కు కాటన్ బాక్సులు తరలించే మరో ఆర్డర్ రావడంతో ఆ పనికి వెళ్లారు. పని పూర్తయిన తర్వాత తన ఆటో వెనుక సీట్లను శుభ్రం చేస్తున్న సమయంలో సీటు పక్కనున్న సందులో సెల్‌ఫోన్ కనిపించింది. అది తన ఆటోలో ప్రయాణించిన వ్యక్తిదేనని భావించిన ఆయన, యజమానికి తిరిగి అందించాలనే ఉద్దేశంతో సెల్‌ఫోన్‌ను భద్రంగా తీసుకుని టూ టౌన్ పోలీస్ స్టేషన్‌కు బయలుదేరారు.అదే సమయంలో టూ టౌన్ పోలీస్ స్టేషన్



ఆటో డ్రైవర్‌ను అభినందిస్తున్న సీఐ ఇజాజుద్దీన్

సిబ్బంది ఫిర్యాదు ఆధారంగా సీసీ కెమెరా ఫుటేజీలను పరిశీలిస్తున్న సమయంలో ఆటో డ్రైవర్ అబ్దుల్ హఫీజ్ స్వచ్ఛందంగా సెల్‌ఫోన్‌తో పోలీస్ స్టేషన్‌కు చేరుకుని టూ టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇజాజుద్దీన్‌కు అప్పగించారు.అనంతరం టూ టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇజాజుద్దీన్ సెల్‌ఫోన్‌ను దాని యజమాని వెంకట్ రాజుకు అప్పగించారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్ అబ్దుల్ హఫీజ్ ప్రదర్శించిన నిజాయితీని కొనియాడుతూ శాలువా కప్పి సత్కరించారు.ఈ విషయం తెలుసుకున్న మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ డి.జానకి ఆటో డ్రైవర్ అబ్దుల్ హఫీజ్‌ను ప్రత్యేకంగా అభినందిస్తూ, సమాజంలో ఇటువంటి నిజాయితీ గల వ్యక్తులు ఇతరులకు ఆదర్శంగా నిలుస్తారని పేర్కొన్నారు.

## లయన్స్ క్లబ్ సేవలు విస్తరించాలి

**లయన్ డిస్ట్రిక్ట్ గవర్నర్ సురేష్ జగ్నాని**

**మహబూబ్ నగర్, జులై 19, ప్రభాతవార్త:** లయన్స్ క్లబ్ సేవలను మరింతగా విస్తరించాలని లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 320 ఎ గవర్నర్ సురేష్ జగ్నాని పిలుపు నిచ్చారు. మహబూబ్ నగర్‌లోని నిర్మల్ కన్వేషన్ హాల్ లో ఆదివారం జరిగిన లయన్స్ క్లబ్ ల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కోశాధికారు లకు నిర్వహించిన ఒక రోజు శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథులు గా హాజరై ప్రసంగించారు. ప్రతి క్లబ్ పిఎస్‌టిలు నాయకత్వ లక్షణాలు కలిగి ఉంటూ సేవా భావంతో సేవా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. జిఎటి కో ఆర్డినేటర్ లయన్ నరేందర్ రెడ్డి మాట్లాడుతూ సామాజిక స్పృహ కలిగి ఉన్న వారిని లయన్స్ క్లబ్‌లో సభ్యులుగా చేర్చుకొని క్లబ్ ప్రతిష్టను పెంచాలన్నారు. ఆయా క్లబ్‌ల ఆధ్వర్యంలో విరివిగా మొక్కలు నాటాలని కోరారు. వివిధ అంశాలపై పిఎస్‌టి లకు లయన్స్ వక్తలు శిక్షణను ఇచ్చారు. శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్‌లను ప్రదానం చేశారు. పిఎస్‌టి ఫోరం కో ఆర్డినేటర్ లయన్ గాజుల శ్రీనివాస్ లు,ప్రెసిడింగ్ ఆఫీసర్ లయన్ నూలి శ్రీనివాస్ ల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లు


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న లయన్ డిస్ట్రిక్ట్ గవర్నర్ సురేష్ జగ్నాని

లయన్ డా. శశికాంత్, లయన్ నాగరాజు, పిడిజిలు లయన్ మహేంద్ర కుమార్ రెడ్డి, లయన్ డా. అంబటి నటరాజ్, మోహన్, రాధకృష్ణన్, హరి నారాయణ భట్టాడ్, ఆర్‌సిలు డా. ప్రశాంత్ రెడ్డి,లయన్ రామకృష్ణ, లయన్ కె.మోహన్ గౌడ్, లయన్స్ క్లబ్ ప్రతి నిధులు అశోక్, గోవర్ధన్, గాజుల శ్రీనివాస్ లు, శ్రీహరి, తిరుపతి రెడ్డి పాల్గొన్నారు.

## ప్రాజెక్టుల సాధనకు కృషి చేస్తాం

మొదటి పేజీ తరువాయి భాగం..

ముఖ్యమని, పార్టీలకు అతీతంగా నిజాయితీతో పనిచేస్తేనే శాశ్వత పరిష్కారం సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. అలాగే అంతర్రాష్ట్ర సమన్వయం ప్రాధాన్యతను వివరించిన ఎమ్మెల్యే, ఆంధ్రప్రదేశ్‌లో పోలవరం ప్రాజెక్టు ఎలా జీవనాడిగా మారిందో, అలాగే తెలంగాణలో సాగునీటి ప్రాజెక్టులు రైతులకు ప్రాణాధారంగా మారాలని తెలిపారు. కృష్ణానది నీటి వినియోగంపై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలు కలిసి చర్చలు జరిపితేనే స్థిర పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. పాలమూరు ప్రాంతానికి సాగునీరు అందించడం ప్రభుత్వ ప్రాధాన్యతగా ఉందని, ఉమ్మడి మహబూబ్ నగర్ ప్రాజెక్టులు పూర్తి అయితే లక్షల ఎకరాలకు నీరు అందడంతో రైతుల జీవనోపాధి మెరుగుపడుతుందని అన్నారు. ఇటీవల తుంగభద్ర డ్యామ్ కొత్త గేట్ల ప్రారంభోత్సవానికి గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా హాజరై గేట్లను ప్రారంభించడమే కాకుండా, కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తో ఆర్‌డీఎస్ అంశంపై చర్చించి సహకారం కోరిన విషయాన్ని వెల్లడించారు. రాజకీయ ఆరోపణలకంటే కార్యాచరణపై దృష్టి పెట్టి ప్రాజెక్టులను ముందుకు తీసుకెళ్లాలని, పాలమూరు అభివృద్ధి కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రజల సహకారంతో అన్ని ప్రాజెక్టులను విజయవంతంగా పూర్తి చేస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బెక్కెరి అనిత మధుసూదన్ రెడ్డి, డిసిసి నాయకులు సాయిబాబా, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు షేక్ ఫరూఖ్ హుస్సేన్, జెఏసి నాయకులు బెక్కెం జనార్దన్, వీరబ్రహ్మాచారి, సీనియర్ సిటిజన్స్ ఫోరం నాయకులు జగపతి రావు, కార్పొరేటర్లు ఎంపి ప్రవీణ్ కుమార్, రమేష్ రెడ్డి, ప్రశాంత్ పాల్గొన్నారు.

## చేపల వేటకు వెళ్లి వ్యక్తి గల్లంతు

మొదటి పేజీ తరువాయి భాగం..

చీకటి పడంత వరకు గాలింపు చర్యలు చేపట్టారు. సహాయక చర్యలు చేపడుతున్న పోలీసులకు, ఫైర్ స్టేషన్ సిబ్బందికి గ్రామ సర్పంచ్ మోహన్ గౌడ్, మాజీ సర్పంచ్ దామోదర్ , గ్రామస్తులు పూర్తి సహకారం అందించారు. కుటుంబ సభ్యులు రోజంతా ఎదురుచూపులు, గ్రామంలోని ప్రజలు వ్యవసాయ పనులు వదులుకొని ఊర చెరువు వద్ద గల్లంతైన వ్యక్తి కోసం చెరువు వద్దనే ఉండి పోయారు.ఎంత శ్రమించిన ఫలించలేదు. **గాలింపు చర్యలు నిలిపివేత....** మామిళ్ళపల్లి ఊర చెరువులో శని వారం మధ్యాహ్నం చేపల వేటకు వెళ్లిన ఆవుల తిరుపతయ్య రాత్రి వరకు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. ఎస్సై పుట్ట మహేష్ ఆధ్వర్యంలో పోలీసు బలగాలు, ఫైర్ స్టేషన్ ఎస్ఐ శంకర్ గౌడ్ ఆధ్వర్యంలో సిబ్బంది, గ్రామస్తుల సహకారంతో ఆదివారం రోజంతా బోటు సాయంతో గాలింపు చేపట్టిన గల్లంతైన వ్యక్తి దొరకకపోవడంతో తాత్కాలికంగా సహాయక చర్యలు నిలిపివేశారు.

## భయం గుప్పిట్లో విధులు..

మొదటి పేజీ తరువాయి భాగం..


ఎంపిడిఓ కార్యాలయంలో పై కప్పు నుంచి పడిపోతున్న పెచ్చులు

విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. శిథిలావస్థకు చేరుకున్న భవనాలకు మరమ్మతులు చేపట్టకుండా నూతనంగా భవనాలు నిర్మించి వదిలేస్తున్నారు. లక్షలు వెచ్చించి భవనాలు నిర్మించి నిరుపయోగంగా పెట్టేదాని కన్నా శిథిలావస్థకు చేరుకున్న భవనాలకు నిధులు కేటాయించి మరమ్మతులు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కానీ తహసీల్దార్, ఎంపిడిఓ కార్యాలయంలో సిమెంట్ పెచ్చులు ఊడి పడి పోతుండటంతో పాటు వర్షాలు భారీగా వచ్చినప్పుడు కార్యాలయంలో పైకప్పులు లీకేజీలతో వర్షం నీరు కార్యాలయంలో జాలువారుతుంది. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకొని ఉప్పునుంతల మండలంలో దెబ్బతిన్న ప్రభుత్వ కార్యాలయాల పై పరిస్థితి పై సమీక్షి ంచాలని కోరుతున్నారు.

## ఎస్ఐఆర్ ఫామ్ అందజేసిన మాజీ మంత్రి లక్ష్మారెడ్డి



ఎస్ఐఆర్ ఫామ్ అందజేస్తున్న మాజీ మంత్రి లక్ష్మారెడ్డి

**జడ్చర్ల, జులై19, ప్రభాతవార్త:** జడ్చర్ల పట్టణంలో కేంద్రం ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌లో మాజీ మంత్రి డా.సి.లక్ష్మారెడ్డి పాల్గొని తన ఓటు వివరాలను ఎన్యూమరేషన్ ఫామ్‌లో నింపి బిఎల్‌వో కు అందజేశారు. ఎస్ఐఆర్ జరుగుతున్న విధానాన్ని బీఎల్‌వోను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఇంటికి చేరి అర్హులైన ప్రతి ఒక్కరిని ఓటరు జాబితాలో చేర్చాలని బీఎల్‌వో కు సూచించారు. ఓటర్ల సందేహాలను నివృత్తి చేస్తూ విజయవంతం చేయాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా అధికారులు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. బలమైన ప్రజాస్వామ్యానికి ప్రతి ఓటు విలువైనదే. “నా ఓటు – నా హక్కు“ అనే భావనతో ఎస్ఐఆర్ కార్యక్రమంలో భాగస్వాములు అవుదామని ఓటర్లకు మాజీ మంత్రి పిలుపునిచ్చారు.

## ఘనంగా బోనాల ఉత్సవాలు

**నిమ్మ బావి గడ్డ వద్ద బొడ్రాయి ప్రతిష్టాపన : హాజరైన మాజీ మంత్రి లక్ష్మారెడ్డి**

**జడ్చర్ల, జులై 19, ప్రభాతవార్త :** జడ్చర్ల పట్టణం నిమ్మబావి గడ్డలో బొడ్రాయి, బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. మహిళలు పెద్ద ఎత్తున బోనాలతో బైలెల్లి బొడ్రాయి చుట్టూ ప్రదక్షిణలు చేశారు. పట్టణ వాసులకు ఎలాంటి ఆపద రావద్దని, వర్షాలు బాగా కురిసి పంటలు పండాలని వేడుకున్నారు. బోనాల ఉత్సవాలకు మాజీ మంత్రి డా.సి.లక్ష్మారెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిమ్మబావి గడ్డ ప్రజలకు బోనాల పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా మహిళలు పెద్ద ఎత్తున బోనాలతో తరలివచ్చారు. బోనాలు బొడ్రాయి ఉత్సవాలతో నిమ్మబావిగడ్డ ప్రాంతం అంతా సందడి నెలకొన్నది.

## రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే లక్ష్యం

**వైఎస్ షర్మిలను కలిసిన సిడబ్ల్యుసి ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్ రెడ్డి**

**మహబూబ్ నగర్, జులై 19, ప్రభాతవార్త :** కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్ రెడ్డి ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలను మర్యాదపూర్వకంగా కలిశారు. దివంగత ముఖ్యమంత్రి డా. వైఎస్ రాజశేఖర రెడ్డి ఆశయాలకు అంకితభావంతో కట్టుబడి ఉన్న అనుచరుడైన వంశీచంద్ రెడ్డి, వైఎస్ఆర్ ప్రజా సంక్షేమ దృక్పథం తనకు ఎప్పటికీ స్ఫూర్తిగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా డా. వైఎస్ రాజశేఖర రెడ్డి ఆశయాల సాధన, ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడం, సంస్థాగత నిర్మాణాన్ని విస్తరించడం వంటి అంశాలపై ఇద్దరూ విస్తృతంగా చర్చించారు. డా. వైఎస్ రాజశేఖర రెడ్డి కలలను సాకారం చేయడంతో పాటు రాహుల్ గాంధీని దేశ ప్రధానమంత్రిగా చూడాలనే లక్ష్యంతో వైఎస్ షర్మిల చేస్తున్న కృషిని వంశీ చంద్ రెడ్డి అభినందించారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ఆమె అంకితభావంతో పనిచేస్తున్న తీరు పార్టీకి ఎంతో బలాన్ని చేకూరుస్తుందని ఆయన పేర్కొన్నారు.

## ఎస్ఐఆర్‌పై అప్రమత్తంగా ఉండాలి

**ఎస్ఐఆర్ సమీక్షలో అసెంబ్లీ కోఆర్డినేటర్ బొజ్జ అమరేందర్ రెడ్డి**

**జడ్చర్ల, జులై 19, ప్రభాతవార్త:** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ( ఎస్ఐఆర్ ) పై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండి వివరాలు జాగ్రత్తగా నమోదు చేసుకోవాలని అసెంబ్లీ కోఆర్డినేటర్ బొజ్జ అమరేందర్ రెడ్డి సూచించారు. ముఖ్యమంత్రి ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతి సమీక్షా సమావేశంలో సీఎం ప్రవాసి, ప్రజావాణి రాష్ట్ర కోఆర్డినేటర్, టీపీసీసీ ఎస్ఐఆర్ జడ్చర్ల అసెంబ్లీ కోఆర్డినేటర్ బొజ్జ అమరేందర్ రెడ్డి పాల్గొన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిని సమీక్షించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర వ్యవహారాల ఏఐసీసీ ఇన్‌ఛార్జ్, టీపీసీసీ అధ్యక్షుడు, క్యాబినెట్ మంత్రులు , ఎమ్మెల్యేలతో ఆదివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. తెలంగాణకు చెందిన ఏఒక్క పౌరుడిఓటు పోవద్దని, ఈ నెల 30లోపు 100ఎన్యూమరేషన్ ప్రక్రియ పూర్తిగా డిజిటలైజేషన్ అవ్వాలని మంత్రులను ఆదేశించారు. ఎస్ఐఆర్‌లో అత్యుత్తమంగా పనిచేసిటాప్ వంద మంది బిఎల్ఏలకు రాహుల్ గాంధీని పరిచయంచేసి, ఆయనతో ఫోటో దిగేఅవకాశం కల్పించాలని ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. పార్టీ కోసం ప్రభుత్వం కోసం అంకితభావంతో కష్టపడే కార్యకర్తలకు ఇది ఒక గొప్ప ప్రోత్సాహం అని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డికి జడ్చర్ల అసెంబ్లీ కోఆర్డినేటర్ బొజ్జ అమరేందర్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

## విద్యార్థి జాక్ సమావేశం

**రాష్ట్ర కాంగ్రెస్ ఎస్సీ డిపార్ట్మెంట్ వైస్ చైర్మన్ గడ్డం శ్రీనివాస్**

**చిన్నంబాయి, జులై 19 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర మలిదశ విద్యార్థి ఉద్యమ జేఏసీ నాయకులందరూ శనివారం ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీ ముందు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. వనపర్తి జిల్లా చిన్నంబావి మండలం పెద్ద మారు గ్రామానికి చెందిన ఓయూ తెలంగాణ విద్యార్థి జేఏసీ నాయకులుగా కొనసాగుతూ ఇటీవల రాష్ట్ర కాంగ్రెస్ ఎస్సీ డిపార్ట్మెంట్ వైస్ చైర్మన్ గా నియామకం పొందిన డా. గడ్డం శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ఉద్యమకారుల గుర్తింపులో భాగంగా కేకే కమిటీ ఏర్పాటు చేయడం స్వాగతిస్తున్నామని, మన కాంగ్రెస్ ప్రభుత్వ ము ఉద్యమకారుల గుర్తుంపుకు కేకే కమిటీ కి సభ్యుల పేర్లు ఇవ్వటంతో దానికి సంబంధించిన అంశాలను, భవిష్యత్తు కార్యచరణ గురించి ప్రెస్ మీట్‌లో మాట్లాడారు. త్వరలోనే రాష్ట్రంలోని విద్యార్థి, ఉద్యమకారులందరినీ ఏకతాటి పైకి తీసుకొచ్చి ప్రభుత్వ ఫలాలు అందే విధంగా చూస్తామని గడ్డం శ్రీనివాస్ తెలియజేశారు.

## మ్యాడ్ మంకీస్ రెస్టారెంట్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే

**మహబూబ్‌నగర్, జులై19 ప్రభాతవార్త :** మహబూబ్ నగర్ నగరం, తిరుమల హిల్స్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన “మ్యాడ్ మంకీస్“ రెస్టారెంట్‌ను ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, నగర అభివృద్ధిలో భాగంగా ఆధునిక వసతులతో కొత్త వ్యాపార సంస్థలు ఏర్పడటం ఆనందదాయకమని తెలిపారు. స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ గుమ్మాల మమత శ్రీనివాస్, కార్పొరేటర్లు ప్రవీణ్ కుమార్, రమేష్ రెడ్డి, ప్రశాంత్ నాయకులు రమేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## 20వ డివిజన్‌లో ఎస్ఐఆర్ మెగా హెల్ప్ డెస్క్

**మహబూబ్‌నగర్ జులై 19 ప్రభాతవార్త :** మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 20వ డివిజన్ లక్ష్మీనగర్ కాలనీలో ఎస్ఐఆర్ మెగా హెల్ప్ డెస్క్ విజయవంతంగా నిర్వహించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఓటరు నమోదు, పునఃపరిశీలన కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక సహాయ కేంద్రాన్ని బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం నూతన ముఖద్వారం వద్ద ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సేవలు అందించారు. లక్ష్మీనగర్ కాలనీ ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. హెల్ప్ డెస్క్ నిర్వహించిన కార్పొరేటర్ కిరణ్ కుమార్ రెడ్డిని అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ అభినందించారు. బిఎల్‌వో, బిఎల్ఏ లతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు, కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో బిఎల్ ఓ, బిఎల్ఏ ఓంకార్, శ్రీకాంత్, భాను ప్రకాష్, అజయ్ కుమార్, సాయికుమార్, కాలనీ వాసులు శంకర్ నాయక్, సత్యనారాయణ, శంకర్, మురళీధర్ రావు మొదలగు వారు పాల్గొన్నారు.

## ఓపెన్ డిగ్రీ అడ్మిషన్లకు ఆగష్టు 7 వరకు గడువు

**ఎన్టీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. వి.రాజేంద్ర ప్రసాద్**

**మహబూబ్‌నగర్, జులై19, ప్రభాతవార్త :** డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో 2026, 27 విద్యా సంవత్సరానికి సంబంధించిన డిగ్రీ బిఏ, బి.కామ్, బి.యస్సీ., కోర్సులో ప్రవేశాలకు ఆగష్టు 7వరకు దరఖాస్తులు స్వీకరింస్తున్నటు ఎన్టీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. వి. రాజేంద్ర ప్రసాద్, కోఆర్డినేటర్ డాక్టర్ సిహెచ్.కిషోర్ కుమార్ సంయుక్త ప్రకటనలో తెలిపారు. డిగ్రీ కోర్సులో బి.ఏ, బి.కామ్, బి.స్సీ., తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ మీడియంలో చేరడానికి అవకాశమని తెలిపారు. ఇంటర్, ఓపెన్ ఇంటర్, రెండు సంవత్సరాల ఐ.టి.ఐ, డిప్లొమా పూర్తిచేసిన అభ్యర్థులు ఆగష్టు 7 వ తేదీలోపు ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఉద్యోగులు, గృహిణులు, చదువు మధ్యలో నిలిపివేసినవారు, ఉన్నత విద్యను కొనసాగించాలనుకునే వారికి ఓపెన్ యూనివర్సిటీ ద్వారా డిగ్రీచదివే మంచి అవకాశం కలిపించబడిదన్నారు. డిగ్రీ ద్వితీయ, తృతీయసంవత్సరాలలో చదువుతున్న విద్యార్థులు తమ కోర్సు ఫీజులను కూడా ఆగస్టు 7లోపు ఆన్లైన్లో చెల్లించాలని సూచించారు. అడ్మిషన్లలు, ఫీజులు తదితర వివరాలకు 7382929757 ను సంప్రదించాలని తెలిపారు.

## చిన్నారి నవ్వులు..

# మళ్ళీ చూద్దాం

- బ్రెయిన్ ఇన్ఫెక్షన్ తో కిమ్స్ లో చికిత్స
- 45రోజులుగా ఐసీయూ లోనే..
- ఇప్పటికే రూ.35లక్షల ఖర్చు..
- బిడ్డ ఆరోగ్యం కోసం తల్లఢిల్లుతున్న తల్లిదండ్రులు
- ఆస్తులు లేవు.. అమ్మడానికి పొలావు లేవు..
- దేవుడి పైనే భారం



అప్పటి దాకా ఆడుతూ.. నవ్వుతూ ఉన్న బిడ్డకు జ్వరం రావడంతో మాములు జ్వరమే అనుకుని త్వరగా కోలుకుంటాడని ఆశ పడ్డ తల్లితండ్రులకు పిడుగు లాంటి వార్త తెలిసి గుండె మరింత బరువెక్కింది. జ్వరం శరీరానికి కాదు.. బ్రెయిన్ కు అని తెలియడంతో దిక్కుతోచని స్థితికి వెళ్లిపోయారు. అసలే పేదరికం... రెక్కడితే కానీ జీవనం గడవని పరిస్థితి. ఓ వైపు బతుకు పోరాటం..మరో వైపు బిడ్డను ఎలాగైనా కాపాడుకోవాలని ఆరాటం..

**మహబూబ్‌నగర్ బ్యూరో, జులై 19, ప్రభాతవార్త**

నాగర్ కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండలం గొరిట గ్రామానికి చెందిన రాకేష్ శ్రీలేఖ దంపతులకు ఇషాన్ అర్విక్( 21నెలల బాబు) ఉన్నాడు. ఉన్న ఊరిలో ఉపాధి లేక జడ్చర్లలో కిరాయి ఇల్లు తీసుకుని ఉన్నారు. తండ్రి ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. ఊర్లో వ్యవసాయ పొలం లేదు..వేరే ఇతర ఆస్తులు కూడా లేవు. పని చేస్తే కానీ రోజు గడవని పరిస్థితిలో బిడ్డకు బ్రెయిన్ ఇన్ఫెక్షన్ రావడం తో ఎం చేయాలో పాలుపోలేదు..తమ శక్తి మేరకు వైద్యం ఖర్చులను బరిస్తూ దాదాపు 50రోజులుగా బిడ్డ ఆరోగ్యం కోసం తండ్లాడుతున్నారు. బ్రెయిన్ ఇన్ఫెక్షన్‌తో మరో వైపు బిడ్డ యుద్ధం చేస్తున్నాడు. ప్రస్తుతం గచ్చిబౌలి వద్ద ఉన్న కిమ్స్ దవాఖానలోని పీసీయూలో త 48రోజులుగా చికిత్స పొందుతున్నాడు. ఇప్పటివరకు రూ.35లక్షల వరకు వైద్యం కోసం ఖర్చులు అయ్యాయని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. తెలిసిన వాళ్ళు, కుటుంబ సభ్యుల నుంచి సుమారు రూ.13లక్షల వరకు బిల్లులు పే చేసినట్లు బాబు తల్లిదండ్రులు చెప్పారు.


**ఇది వ్యాధి..**

ఈషాన్ అర్విక్ “తీవ్రమైన పయోజెనిక్ మెనింజైటిస్, అబ్స్ట్రక్టివ్ హైడ్రోసెఫాలస్, ఎపిడ్యూరల్ అబ్సెస్, కల్చర్ పాజిటివ్ సెప్సిస్“తో మా పీడియాట్రిక్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్ లో చేర్చారు. అతనికి సబ్‌ఆక్సిపిటల్ క్రానియెక్టమీ, గ్రాన్యులేషన్ కణజాలాన్ని తొలగించడం, పోస్టీరియర్ ఫోసా నుండి చీమును తీసివేయడం, ఎల్2ఎల్5 లామినోటమీ మరియు ఎల్2 స్థాయిలో మైలోటమీతో పోస్టీరియర్ డీకంప్రెషన్, చీమును తీసివేయడం, ఎపిడెర్మోయిడ్ సిస్ట్‌ను తొలగించడం వంటి శస్త్రచికిత్సలు జరిపారు. ప్రస్తుతం బాబు ఈవిడి ఇన్‌సిటుతో మెకానికల్ వెంటిలేషన్‌పై ఉన్నాడని, యాంటీబయాటిక్స్, యాంటీ ఎపిలెప్టిక్స్ మందులు వాడుతున్నట్లు తెలిపారు. ప్రస్తుత పరిస్థితిని బట్టి బాబుకు మరో 34 వారాల పాటు ఆసుపత్రిలో ఉండవలసి ఉంటుందని కిమ్స్ వడా. సుమన్ లింగబతిన్ ఎండీ పీడియాట్రిక్స్ తెలిపారు.



**దాతల కోసం ఎదురుచూపులు..**

ప్రాణాపాయ స్థితిలో ఉన్న తమ బిడ్డను కాపాడాలని తల్లి తండ్రులు వేడుకుంటున్నారు. ఒక్క చేయితో చప్పట్లు రావు.. రెండు చేతులు కలిస్తేనే చెప్పట్లు.. పదిచేతులు కలిస్తేనే బలం.. వెయ్యి చేతులు కలిస్తే ధైర్యం.. అదే ధైర్యాన్ని బిడ్డకు ఇద్దాం.. ప్రాణం నిలబెడదాం. సాయం చేయాలనుకునే దాతలు ఇర్విన్ తండ్రి రాకేష్ సెల్ : 7386528640, 9603642035 కు ఫోన్ పే ద్వారా సాయం అందించాలని వేడుకుంటున్నారు.



KIMS CUDDLES
MOTHER & CHILD CENTRE

Hyderabad
Date : 9/7/2026

TO WHOMSOEVER IT MAY CONCERN

This is regarding Master Eshan Arvik, 20 month old male child, admitted in our PICU with "Severe Pyogenic meningitis (Burkholderia cepacia) with obstructive hydrocephalus, epidural abscess and culture positive sepsis". He underwent Suboccipital craniectomy and excision of granulation tissue with drainage of pus from posterior fossa, Posterior decompression with L2-L5 Laminotomy and Myelotomy at L2 level and drainage of pus and excision of epidermoid cyst.

Currently child is on mechanical ventilation with EVD insitu, on multiple antibiotics and anti epileptics. Plan is to do a VP shunt in another week. Child will need another 3-4 weeks of hospital stay considering the given condition.

## ఆలయ నిర్మాణానికి విరాళం

**ఖిల్లా గణపురం జులై 19, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని కాళికామాత నూతన ఆలయ నిర్మాణానికి రాష్ట్ర బీజేవైఎం ఉపాధ్యక్షులు శీర్వాల సాయినాథ్ ఆదివారం ఆలయాన్ని సందర్శించి ఆలయ కమిటీ నిర్వాహకులకు 51 వేల రూపాయల విరాళాన్ని అందజేశారు. ఆలయాలు భక్తి సామరస్యానికి ప్రతీకలుగా నిలుస్తాయని అన్నారు. విశ్వబ్రాహ్మణ సంఘం మండల నాయకులు సాయినాధుని శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షుడు బుచ్చిబాబు గౌడ్, నాయకులు బాల ఆంజనేయులు గౌడ్, ఆశన్న, సత్యనారాయణ, రామ్ చందర్, వెంకటేష్, శ్రీను, కమ్మరి ఆంజనేయులు, పులేందర్ శ్రీనివాసులు, సిద్ధు, ప్రసాద్, రవి తదితరులు పాల్గొన్నారు.

**ఎమ్మెల్యే సహకారంతో**

## హైమాక్స్ లైట్లు ప్రారంభం



హైమాక్స్ లైట్లను ప్రారంభిస్తున్న దృశ్యం

**వెల్దండ, జులై19 ప్రభాతవార్త:** వెల్దండ మండలంలోని రాచూరు గ్రామంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో మంజూరైన హైమాక్స్ లైట్లను గ్రామ నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ అభివృద్ధిలో భాగంగా హైమాక్స్ లైట్లను అందజేసిన ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అన్ని రంగాల అభివృద్ధి పరుచుకుంటామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ యాదయ్య, నాయకులు దుబ్బలక్ష్మయ్య, కొంగళ్ల యాదయ్య, పడకండి వెంకటేష్, కృష్ణయ్య, బీరయ్య, వెంకటయ్య, బాలరాజు, శ్రీశైలం, జంగయ్య, రామానుజన్, చంద్రశేఖర్, శివకుమార్‌తో పాటు తదితరులు ఉన్నారు.

## మత్తు పదార్థాల తయారీ కేంద్రంపై ఈగల్‌టీమ్(నార్కొటెక్స్)స్పెషల్ టీమ్ మెరుపుదాడులు

- రు.20.30లక్షల విలువ చేసే 1150కిలోల అల్ప్రాజోలామ్ స్వాధీనం : నలుగురి అరెస్ట్
- మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలం అన్నాసాగర్ వద్ద మత్తు తయారీ కేంద్రంగా లక్ష్మినర్సింహ్మ ఫౌల్ట్రీ ఫామ్



ఫౌల్ట్రీ ఫారమ్‌లో అల్ప్రాజోలామ్,సీహెచ్ మత్తు తయారీకి ఉపయోగిస్తున్న పరికరాలు,సామాగ్రి

**భూత్పూర్, జులై 19, ప్రభాతవార్త :** ఎంతో కాలంగా గుట్టుచప్పుడు కాకుండా అల్ప్రాజోలామ్, సీహెచ్‌లాంటి మత్త పదార్థాలను తయారీ చేస్తూ ఆదివారం ఈగల్‌టీమ్(నార్కొటెక్స్)స్పెషల్ పోలీసులకు పట్టుపడ్డ వైనం మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలంలో చోటు చేసుకుంది. గత కొంత కాలంగా గుట్టుచప్పుడు కాకుండా మత్తుపదార్థాలను తయారు చేస్తూ రహస్యంగా జిల్లాతో పాటు ఇతర జిల్లాలు, ప్రాంతాలకు ఎగుమతి చేస్తూ లక్షలు గడిస్తున్న నలుగురిని ఆదివారం హైదరాబాద్ నార్కొటెక్స్ హైదరాబాద్ స్పెషల్ ఈగల్‌టీమ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. జిల్లాలలో పట్టుపడిన కొంత మంది ఇచ్చిన సమాచారం మేరకు ఈగల్‌టీమ్ హైదరాబాద్ నార్కొటెక్స్ స్పెషల్ టీమ్ సభ్యులు భూత్పూర్ మండలం అన్నాసాగర్‌కు సమీపంలో జాతీయ రహదారి-44కు పక్కనే ఉన్న లక్ష్మి నర్సింహ్మ ఫౌల్ట్రీ ఫారమ్‌పై మెరుపు దాడి నిర్వహించి 1150 కిలోల అల్ప్రాజోలామ్ మత్తు పదార్థంతో పాటు మత్తుపదార్థాలను తయారీకి ఉపయోగిస్తున్న పరికరాలతో పాటు సంబంధమున్న నలుగురు మాలెల జయప్రకాష్‌గౌడ్, చౌదర్‌పల్లి కృష్ణయ్యగౌడ్, గడ్డగిది బాలాంజనేయులులతో పాటు భూయజమాని బోయనర్సింహులును అదుపులోకి తీసుకున్నట్లు నార్కొటెక్స్ హైదరాబాద్ స్పెషల్ ఈగల్‌టీమ్ పోలీస్ వర్గాలు తెలిపాయి. దాదాపుగా రు.20.30లక్షల విలువ చేసే 1150కిలోల అల్ప్రాజోలామ్ మత్తుపదార్థం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

## కృష్ణా నదిపై బ్యారేజీలు నిర్మించాలి..

**కృష్ణా ట్రిబ్యునల్ పాలమూరు రంగారెడ్డి లిఫ్ట్ కు నీటి వాటాగా 60 టిఎంసిల కేటాయింపు చేయాలి**

**శ్రీశైలం 67 గ్రామాల నిర్వాసితులకు న్యాయం చేయాలి**

**వెల్లటూరు, గుంది మళ్ళ బ్యారేజ్ నాయకులు పెరుమాళ్ళ శ్రీనివాస్**



రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రసంగిస్తున్న శ్రీనివాస్

**చిన్నంబావి, జులై 19 ప్రభాతవార్త :** ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో కృష్ణనది సుమారు 200కిలోమీటర్ల ప్రవహిస్తూ ఉన్న నిర్వసితులుగా మారిన కొల్లాపూర్, అలంపూర్, గద్వాల వనపర్తి జిల్లాలో సాగు, తాగునీటి సమస్య పరిష్కారానికి కృష్ణా నదిపై బ్యారేజ్ కం రోడ్డు బ్రిడ్జి నిర్మాణం చేయాలని అలాగే పాలమూరు రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు నీటి కేటాయింపు చేయాలనీ ఆదివారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో క్రౌన్ గార్డ్ ఫంక్షన్ హాల్‌లో సాగు నీటి సమస్యపై జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో కొల్లాపూర్ నియోజక వర్గం జేఏసీ తరుపున పాల్గొన పెరుమాళ్ళ శ్రీనివాస్ అన్నారు. జూరాల, బీమా చివరి ఆయకట్టు అయిన ఉమ్మడి వీపనగండ్ల మండలంలో సుమారు 45 వేల ఎకరాలకు నీళ్ళు అందించడానికి కృష్ణ నదిపై మరో లిఫ్టు కానీ, లేదా బ్యారేజ్ నిర్మాణం చిన్నంబావి మండలంలో ఏర్పాటు చేయాలని సమావేశం దృష్టికి తీసుకెళ్లారు. గోదావరి నదిపై కాలేశ్వరం మాదిరిగా కృష్ణా నదిపై కూడా బ్యారేజ్ ను నిర్మించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా యెన్నం శ్రీనివాస్ రెడ్డి, ఎంపీ మల్లు రవి, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ వివిధ పార్టీల జిల్లా అధ్యక్షులు, పలు నియోజకవర్గాల జేఏసీ ఇంఛార్జీలు, రాఘవాచారి, ప్రకాశ్ గౌడ్, తిమ్మప్ప, వెంకటేశ్వర్లు, అడ్వకేటు బెక్కం జనార్ధన్, వేణుగోపాల్ చారి ల ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి జేఏసీ నాయకుల రౌండ్ టేబుల్ సమావేశంలో కొల్లాపూర్ తరుపున తెలంగాణ ఉద్యమకారులు దేశగౌని రామన్ గౌడ్, పెరుమాళ్ళ తిరుపతి, పెరుమాళ్ళ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## పేద విద్యార్థికి ఆర్థికసాయం

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జులై 19 ప్రభాతవార్త:** పేద వైశ్య విద్యార్థిని సాయి లక్ష్మికి ఇంటర్ విద్య కోసం రూ.35 వేల ఆర్థిక సహాయం జోన్ చైర్మన్ సాయి కృష్ణ చేతుల మీదుగా విద్యార్థినీకి అందజేశారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి వాసవి క్లబ్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని జోన్ చైర్మన్ సాయి కృష్ణ పేర్కొన్నారు. ఇప్పటి వరకు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించామని, భవిష్యత్తులో మరిన్ని చేపడతామన్నారు. దాతల సహకారంతో విద్యార్థికి ఆర్థిక సహాయం అందజేశామన్నారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ సభ్యులు, దాతలు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారుఅధ్యక్షుడు సంబు శ్రీనివాసులు, కార్యదర్శి పాండు, కోశాధికారి నాగరాజు పాల్గొన్నారు.

## మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు : ఎస్ఐ

**పెద్దమందడి, జులై 19 ప్రభాతవార్త:** మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని పెద్దమందడి ఎస్ఐ జలంధర్ రెడ్డి అన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో వాహనాలు నడిపేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వాహనాలను నడపాలి అన్నారు. డ్రైవింగ్ లైసెన్స్, బండి కాగితాలు కలిగి ఉండాలన్నారు. రోడ్డు దాటేటప్పుడు భద్రత పాటించాలి నిదానమే ప్రధానం చట్టానికి విరుద్ధంగా నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రమాదాలను అరికట్టడానికి నిబంధనలు పాటించాలన్నారు.

## నిరంతరంగా విద్యుత్ సరఫరా

**మేయర్ గుమ్మల మమత శ్రీనివాస్**

**శివగంగా కాలనీలో నూతన ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం**

**మహబూబ్‌నగర్, జులై 19, ప్రభాతవార్త :** స్థానిక ప్రజల విద్యుత్ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించే దిశగా, మూడో డివిజన్ శివగంగా కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను నగర మేయర్ గుమ్మల మమత శ్రీనివాస్ ఆదివారం ప్రారంభించారు. ఈప్రారంభోత్సవ కార్యక్రమంలో వార్డు ప్రజలు, స్థానిక నాయకులు పాల్గొని హర్షం వ్యక్తం చేశారు. ప్రజలకు నిరంతర, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడమే లక్ష్యంగా ఈ నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు. నగరంలోని ప్రతి కాలనీ అభివృద్ధికి, మౌలిక వసతుల కల్పనకు కట్టుబడి ఉన్నామని మేయర్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

## ప్రేమించాలంటూ వేధింపులు.. యువకుడికి రిమాండ్

**మద్దూరు, జులై 19 ప్రభాతవార్త :** పెదిరిపాడు కేజీబీవీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థినిని ప్రేమించాలంటూ వేధింపులకు పాల్పడిన నారాయణపేట జిల్లా బొమ్మనపాడు గ్రామానికి చెందిన సాయి కార్తీక్ (20)ను మద్దూరు పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం నిందితుడిని న్యాయస్థానంలో హాజరు పరచగా కోర్టు రిమాండ్ విధించినట్లు మద్దూరు ఎస్ఐ బిజ్జ శ్రీనివాసులు తెలిపారు.

## పేకాట స్థావరంపై పోలీసులు దాడి 41,300 నగదు,

**- 9 మందిపై కేసు నమోదు..**

**ఎస్ఐ కురుమూర్తి**

**కల్వకుర్తి, జులై 19 ప్రభాతవార్త:** కల్వకుర్తి పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు 2వ ఎస్ఐ రాజశేఖర్, కానిస్టేబుల్స్ కలిసి దాడులు చేసినట్లు ఎస్సై కురుమూర్తి తెలిపారు. కల్వకుర్తి పట్టణానికి చెందిన 9మంది పేకాట ఆడుతున్న సమాచారం మేరకు 2వ ఎస్ఐ రాజశేఖర్ సిబ్బందితో కలిసి దాడి చేసి అందులో రూ.41,300ల నగదు స్వాధీనం చేసుకోని పేకాట ఆడుతున్న 9 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కురుమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు చెక్ పెట్టాలంటే ప్రజల సహకారం అందించాలని అప్పుడే సాధ్యమవుతుందన్నారు.

## బాల శాస్త్రవేత్తలకు ఇన్స్పైర్ ఆహ్వానం

**సెప్టెంబర్ 15 వరకు గడువు, ఆన్లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరణ**

**ప్రాజెక్టుకు రూ.10వేలు, డీఈవో విజయ కుమారి**

**మహబూబ్ నగర్, జులై 19 ప్రభాతవార్త :** ప్రాథమికోన్నత ఉన్నత పాఠశాలల విద్యార్థుల్లో శాస్త్రీయ వైజ్ఞానిక ఆలోచనలు సృజనాత్మకతను ప్రోత్సహించి వారిని భావి శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దే ప్రధాన లక్ష్యంతో కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖ ఏటా ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఇన్స్పైర్ మనక్ పురస్కారాలకు సంబంధించి 2026,27 విద్యా సంవత్సరంలో విద్యార్థుల నుంచి ఆన్లైన్లో నామినేషన్లను ఆహ్వానిస్తుందని మహబూబ్‌నగర్ జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి తెలిపారు. ఈ ప్రక్రియ ఈనెల 15న ప్రారంభమైంది నామినేషన్ల సమర్పణకు గడువు సెప్టెంబర్ 15 వరకు ఉందన్నారు.

**అర్హులు వీరే..** అన్ని యాజమాన్యాలలో ఉన్నత ప్రాథమికొన్నత పాఠశాలలో 6 నుంచి 12వ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులు. ప్రతి పాఠశాల నుంచి కనీసం ఐదు ప్రాజెక్టుల ఆలోచనలను విద్యార్థుల నుంచి పంపించాలి. ఈ మేరకు ఆయా పాఠశాలల్లో విద్యార్థుల నుంచి వినూత్న ఆలోచనలను ఆహ్వానించి ఉత్తమ ఆలోచనలను ఎంపిక చేసి పంపించవచ్చు సంబంధిత వెబ్సైట్ డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యుఇన్‌స్పైర్‌అవార్డ్స్.డిఎస్‌టి.జిఓవి.ఇన్ లో వీటిని నమోదు చేయాల్సి ఉంటుందని డిఈఓ తెలిపారు.

**ప్రాజెక్టుల తయారీకి రూ.10 వేలు..**

విద్యార్థుల్లోని వైజ్ఞానిక ప్రతిభను వెలికి తీసినందుకు కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖ నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ సంయుక్తంగా ఏటా అమలు చేసే ఈ పథకానికి ఎంపికైన విద్యార్థులకు రూ. పదివేల చొప్పున ఆర్థిక సాయం వారి ఖాతాల్లో నేరుగా జమవుతుంది. దీంతో విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులకు జిల్లా రాష్ట్ర జాతీయ స్థాయిలో పోటీలో నిర్వహిస్తారు. జాతీయస్థాయిలోనూ అత్యుత్తమమైన 60 ప్రాజెక్టులను ఎంపిక చేస్తారు ఒక్కో పాఠశాల నుంచి ఐదు నామినేషన్లు పంపించాలి.

**కొత్త వినూత్న సమస్య పరిష్కార ఎగ్జిబిట్లను రూపొందించాలి...**

విద్యార్థులను పాఠశాల స్థాయి నుంచి ప్రయోగాల వైపు మళ్ళించి నూతన ఆవిష్కరణల వైపు ప్రోత్సహించాలి అందులో భాగంగానే ఇన్స్పైర్ మనక్ అవార్డులు పొందడానికి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. కాబట్టి అన్ని ఉన్నత, ప్రాథమికొన్నత పాఠశాలల నుండి తప్పకుండ 5 ప్రాజెక్ట్స్ ను అప్లోడ్ చేయాలని తెలిపారు. జిల్లాలోని అన్ని పాఠశాలల నుంచి విద్యార్థులను ఆహ్వానిస్తున్నాం రాష్ట్ర, జాతీయస్థాయిలో ఎగ్జిబిట్లను ప్రదర్శించే విధంగా సైన్స్ ఉపాధ్యాయులు తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందని, ఈసారి మరికొన్ని కొత్త ఆలోచనలతో ఎగ్జిబిట్లను రూపొందించే ప్రయత్నం చేయాలని జిల్లా సైన్స్ అధికారి శంశీర్ సూచించారు.